
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 3

శనివారం 31 మే 2025

న్యూస్ బాక్స్

మేలో పది రెట్ల వర్షం

37.5 ఎంఎం వర్షపాతానికిగాను 105 ఎంఎం నమోదు

కర్నూలు అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మే నెలలో సాధారణ వర్షపాతానికి మించి ఎప్పుడూ నమోదు కాదు. ఐదేళ్ల తర్వాత మొదటి సారిగా ఈ మే నెలలో సాధారణ వర్షపాతం 37.5 ఎంఎం గాను ఏకంగా 105 ఎంఎం వర్షపాతం నమోదైంది. ఏప్రిల్‌లో 15.6 ఎంఎం వర్షపాతానికి గాను 44.9 ఎంఎం వర్షం నమోదైంది. దీంతో కర్నూలు జిల్లాలోని పొలాలు పూర్తిగా పదునెక్కాయి. రైతులు గత సంవత్సరం మాదిరిగానే మే నెలలోనే పంటల సాగుకు సిద్ధమయ్యారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండు సమీపంలో ఉన్న విత్తనాలు, ఎరువుల అంగళ్ల వద్ద రైతులు క్యూ కట్టారు. మంత్రాలయం, ఆస్పరి, ఆలూరు, సీ. బెళగల్, గోనెగండ్ల, కౌతాళం, పెద్దకడుబూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, కల్లూరు, మద్దికెర, పత్తికొండ, తదితర మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఇప్పటికే రైతులు పత్తి, కందులు, మిరప, ఉల్లి, మొక్కజొన్న తదితర పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు కొనే పనుల్లో ఉన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

కర్నూలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న యోగాంధ్ర-2025ను విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి యోగాంధ్ర-2025, పీఎం సూర్యఘర్ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాకారం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి. నవ్య పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన **సేవలు అందించండి**

కర్నూలు జీజీహెచ్ అభివృద్ధిపై మంత్రి భరత్ సమీక్ష

డీసీసీబీ అభివృద్ధికి కృషి

చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

4

పొగచూరుతున్న జీవితాలు

- ప్రాణాలు తీస్తున్న సిగరెట్లు
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

హైస్కూల్, కాలేజీ చదువుల్లో ఎలా ఉంటుందో ఓసారి జస్ట్ ట్రై చేద్దాం అనుకుంటారు. ఉఫ్ ఉఫ్ అంటూ రింగులుగా పొగ వదులుతూ ఉంటే ఆ స్టైలే వేరు అనుకుంటూ ఉత్సాహపడతారు. ఉద్యోగం, కుటుంబం ఇలా సవాలక్ష టెన్షన్లకు సిగరెట్ రిలీఫ్ అని నమ్ముతారు. కానీ ఆ నమ్మకమే మనిషిని కుంగదీస్తుంది. సిగరెట్, బీడీ, గుట్కాలకు బానిసై యుక్త వయసు దాటాక ఆసుపత్రులకు అనారోగ్య సమస్యలతో పరుగులు తీస్తారు. డాక్టర్ దగ్గరకు వెళ్తే గాని అర్థం కాదు, జీవితానికే పొగ పెట్టేశామని. స్మోకింగ్ సరదాగానే మొదలవుతుంది కానీ ఆ తర్వాత సర్పంలా చుట్టేసుకుంటుంది. నల్లని తారు ఊపిరితిత్తుల నిండా పేరుకుపోతుంది. యూత్‌ని తెగ ఆకర్షించే సిగరెట్ ప్రమాదకర అలవాటు. సిగరెట్‌ని దూరంగా ఉంచకపోతే, అదే మనల్ని మన భార్యాబిడ్డలు, తల్లిదండ్రులకు దూరం చేసేస్తుంది. 'ఎప్పుడో ఒకటి కదబ్బా...' అంటే మాత్రం జీవితం పొగచూరక తప్పదు. స్మోకింగ్ మానేయడం పెద్ద కష్టం ఏమీ కాదు. కాకపోతే కాస్త భయం, కుటుంబం పట్ల బాధ్యత ఉంటే చాలు. మరి ప్రయత్నించండి.. నేటి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సాక్షిగా...

4 లో

సారాపై ఉక్కుపాదం



- ఫలిస్తున్న అధికారుల ప్రయత్నాలు
- జిల్లాలో 52 సారా రహిత గ్రామాలు
- రాష్ట్రస్థాయిలోనే మొదటిస్థానంలో అమ్మకాలు
- సారా తయారీ, అమ్మకందారులపై కేసులు
- జిల్లాపై దృష్టిపెట్టిన రాష్ట్రస్థాయి అధికారులు

గత వైసీపీ పాలనలో గ్రామాలు, తండాల్లో సారా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతుండేవి. కూటమి ప్రభుత్వం రాగానే నవోదయం2.0 పేరుతో సారా నిర్మూలన కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. సారాపై ఎక్సైజ్ ఉక్కుపాదం మోపింది. జిల్లాలో సారా లేకుండా చేయడమే లక్ష్యంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు పనిచేస్తున్నారు. జిల్లాలో సారా ప్రభావిత గ్రామాలు 110 ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 52 గ్రామాల్లో చుక్కసారా లేకుండా చేశారు. సారా తయారీ, అమ్మకందారులపై కేసులు నమోదు చేస్తుండటంతో వారిలో అలజడి మొదలైంది. ఏదీ ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు జిల్లాలో విజయవంతం చేయడంలో ఆ శాఖాధికారులు సఫలీకృతులవుతున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది మే నెలలో రూ.68 కోట్ల అమ్మకాలు జరిగితే ఈ ఏడాది మే నెలలో అంతకు మించి రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో అమ్మకాలు జరిగాయి.

కర్నూలు అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): సారాపై ఎక్సైజ్ ఉక్కుపాదం మోపింది. మద్యం అమ్మకాలతో సారాకు చెక్ పెట్టే దిశగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కసరత్తు చేస్తోంది. ఆదిశగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తుండటంతో రాష్ట్రస్థాయి అధికారుల చూపు జిల్లాపై పడింది. రెండు నెలలుగా నవోదయం-2.0 అమలు ప్రక్రియలో నాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్ శాఖ కృషిచేస్తుంది. జిల్లాలో ఈనెల మద్యం అమ్మకాలు వంద కోట్ల టార్గెట్‌గా సాగుతున్నాయి. గత ఏడాది మే నెలలో రూ.68 కోట్ల అమ్మకాలు జరిగితే ఈ ఏడాది మే నెలలో అంతకు మించి రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో అమ్మకాలు జరగడం చర్చనీయాంశమైంది. సారా అరికట్టే విధానంపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తాజాగా జిల్లాలో పర్యటించి 'నవోదయం 2.0'పై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో అధికారులతో ఆయన సమావేశమై రాష్ట్ర సరిహద్దు పరిసరాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు.

ఒక్కసారిగా అలజడి

సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న వారిని గుర్తించి వారితో పాటు తయారీ, అమ్మదారులపై బైండోవర్, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడంతో అక్రమ వ్యాపారుల్లో ఒక్క సారిగా అలజడి రేగింది. కేసులకు భయపడి జిల్లాలో ఇప్పటికే 52 గ్రామాల్లో సారా పూర్తిగా లేకుండా చేయగలగడంతో సారారహిత గ్రామాలుగా జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యం వైపు మందు బాబులను ఆకర్షించే తీరులో ఎక్సైజ్ శాఖ ప్రచారం చేస్తోంది. సారా ప్రభావిత గ్రామాల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో కేర్ కమిటీల సమన్వయంతో 73 సదస్సుల ద్వారా ప్రజలో సారా సేవించడం ద్వారా కలిగే అనారోగ్య సమస్యలపై చైతన్యం కలిగించిన తీరును డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారని అధికారులు తెలిపారు. సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందు పక్కా ప్రణాళికతో జిల్లా ఎక్సైజ్ అధికారులు రోజు వారిగా చేపడుతున్న ప్రక్రియను డైరెక్టర్‌కు వివరించారు. ఈ తరహా తీరును రాష్ట్రస్థాయిలో అమలుచేసే దిశగా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తే బాగుంటుందని అధికారులతో చర్చించినట్లు సమాచారం.



జిల్లా సరిహద్దులో చెక్ పోస్టులను పరిశీలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ(ఫైల్)



జిల్లాలో 110 సారా ప్రభావిత గ్రామాలు

జిల్లాలో 484 గ్రామాలు, మజరా గ్రామాలు 30 ఉండగా అందులో 110 సారా ప్రభావిత గ్రామాలున్నాయని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ లెక్కలు సూచిస్తున్నాయి. సారా ప్రభావిత గ్రామాల్లో ఇప్పటికే జిల్లా యంత్రాంగం 52 గ్రామాల్లో సారా అమ్మకాలు లేకుండా చేశారు. గ్రామాల్లో గ్రామ పెద్దల సమక్షంలో తహసీల్దార్, వీఆర్వో, వీఆర్ఏ, ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో సారా రహిత గ్రామాలను ప్రకటించారు. సారా తయారీ, అమ్మకాలు చేస్తున్న వారిపై 470 బైండోవర్ కేసులు, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు.

రూ. 99 మద్యంతో చెక్

రూ. 99 చీప్ లిక్కర్‌ను సారా అమ్మకందారులకు అమ్మేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సారాకు సమానంగా, నాణ్యతతో ఉండటంతో పాటు ధర తక్కువ కావడంతో మందు బాబులు కూడా వాటిని కొనుగోలు చేస్తున్నారు. పోలీసుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా సారా అమ్మకందారులు రూ.99 మద్యంతో పాటు, బెల్టుషాపులవైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం ఉంది. దీనికి తోడు కర్ణాటక బార్డర్ ప్రాంతాలైన ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్లు చౌకగా లభిస్తున్నాయి. సారా స్థానంలో వాటిని కూడా కొందరు అమ్మకాలు చేస్తుండటంతో దాదాపుగా సారా తయారీ, అమ్మకాలకు డిమాండ్ తగ్గిందనే చెప్పాలి.



డ్రోన్లతో స్థావరాల గుర్తింపు

బెల్లం అమ్మకందారులు, సారా తయారీ స్థావరాలు, అమ్మకందారులను డ్రోన్ల సహాయంతో గుర్తించి వరుస కేసులు నమోదు చేస్తుండటంతో సారాకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం ఉంది. కొండ, గుట్టల్లో రహస్య స్థావరాలను సైతం క్షణాల్లో గుర్తించడంతో వారి ఆగడాలకు ఎక్సైజ్ శాఖ చెక్ పెడుతోంది. నిరంతం కొన్ని బృందాలను ఏర్పాటుచేసి సారా నిర్మూలన కోసం పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

సారా లేకుండా చేయడమే లక్ష్యం



జిల్లాలో సారా లేకుండా చేయడమే లక్ష్యం. జిల్లాలో సారా ప్రభావిత గ్రామాలు 110 ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 52 గ్రామాల్లో ఒక్క చుక్క సారా లేకుండా చేశాం. సారా రహిత గ్రామాలుగా జిల్లా యంత్రాంగం ప్రకటించింది. సారా తయారు చేయడం, అమ్మకాలు చేపట్టడంపై ఉక్కుపాదం మోపుతున్నాం. నవో దయం-2.0 కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- పోతుల శ్రీదేవి, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్

బంగారుపేట కేసులో ఏడుగురికి ఐదేళ్ల శిక్ష

కర్నూలు నగరంలోని బంగారుపేటలో సారా తయారీని అరికట్టే దిశగా కాలనీల్లోకి రోడ్ల నిర్మాణ ప్రక్రియలో వివాదం తెలిసిందే. అప్పట్లో పోలీసులపై ఎదురు దాడికి దిగడంతో సారా, ఎక్సైజ్ పోలీసులపై దాడి కేసుల్లో ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటనలో వారికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. ప్రస్తుతం సారా తయారీదారుల్లో ఒక్కసారిగా దడ మొదలైంది. సారా తయారీ, అమ్మకాలకు భయపడుతున్నారు.

మూఢ నమ్మకాలు వద్దు

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్

కర్నూలు హాస్పిటల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు అడ్డుగోడ లాంటిదని జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ అన్నారు. నగరంలోని బిర్లా కాంపౌండ్ వద్ద శుక్రవారం జన విజ్ఞాన వేదిక 3 రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, పర్యావరణం, మహిళా సాధికారిత, మూఢ నమ్మకాల లాంటి అంశాలపై జేవీవీ పని చేస్తోందన్నారు. ప్రభుత్వం సహకారం అందిస్తే అన్ని జిల్లాలో జేవీవీ తరపున అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. జేవీవీ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు మహ్మద్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు కృష్ణోజీ, రమణయ్య, కోటేశ్వరరావు, శ్రీను, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్

దూపాడు-బేతంచెర్ల రైల్వేలైన్‌కు భూమి సేకరించండి

- ఈదుల దేవరబండలో ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్‌కు 10 ఎకరాలు
- రూ.1.61 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): దూపాడు-బేతంచెర్ల రైల్వే లైన్ ఏర్పాట్లకు భూసేకరణ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఏపీఐఐసీ జడ్ఎంను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సరఫరా పైపులైన్ నిర్మాణపు పనులు జూలైలోపు పూర్తికావాలని ఆదేశించారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24 క్లెయిమ్‌లకు రూ.1.61 కోట్లకు ఆమోదం తెలిపామన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ కింద 17 క్లెయిమ్స్‌కు రూ.1,57,50,166, వడ్డీ రాయితీ కింద ఒక క్లెయిమ్‌కు రూ.13,813, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంటు కింద క్లెయిమ్‌కు సంబంధించి రూ.36,663, సేల్స్ ట్యాక్స్ రీయింబర్స్‌మెంటు కింద 5 క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.3,35,265 పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలిపామన్నారు. కేటగిరీల వారీగా జనరల్ కేటగిరీలకు 7, ఎస్సీలకు 15, ఎస్టీలకు 2 మొత్తంగా 24 మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి 2135 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎం అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ కుమార్ రెడద్ది, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంటు విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరానికి తొమ్మిదేళ్లు

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాల్సింది ఇక్కడే ..



- అలుగు నిర్మిస్తే 50 టీఎంసీల నీటి నిల్వ
- నేడు చలో సిద్ధేశ్వరం పేరిట భారీ బహిరంగ సభ

సిద్ధేశ్వరం రాయలసీమ అస్థిత్వస్వరం. తరతరాల సీమ పోరాటాలకు సిద్ధేశ్వరం గాఢమైన వ్యక్తికరణ. గత పదేళ్లుగా రాయలసీమ ప్రజా ఆకాంక్షలకు ప్రతీక. పాలకుల నిర్లక్ష్యం, వివక్షలపై ఎలుగెత్తిన ప్రాంతీయ చైతన్యం. సిద్ధేశ్వరం అలుగు నిర్మిస్తే శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలు వినియోగించుకొనే అవకాశం రాయలసీమకు వస్తుంది. దీని కోసం అలుగు ప్రజా శంకుస్థాపన ప్రజా ఉద్యమంగా 2016 మే 31వ తేదిన జరిగింది. దీన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఈ రోజున సీమ పోరాటదినంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం చలో సిద్ధేశ్వరం కార్యక్రమం చేపట్టారు.

ఆత్మకూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై సిద్ధేశ్వరం సమీపంలో శ్రీశైల జలాశయానికి 860 అడుగుల ఎత్తులో అలుగు నిర్మిస్తే పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుంది. సీమకు శ్రీశైలం వెనకతట్టు జలాలను అందించాలన్న సంకల్పంతోనే 1971-78 కాలంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణాన్ని నీటిపారుదల శాఖాధికారులు ప్రతిపాదించారు. ఇదే క్రమంలో 1976 నుంచి 1988 వరకు శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ నిర్మాణ పనులు జరిగాయి. అప్పటి నుంచి కాల్వ విస్తరణ పనులు పూర్తయి 2000-01లో బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను మూడు జలద్వారాల మీదుగా చేపట్టారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన నీరు శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ ద్వారా బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు వచ్చి చేరుతోంది. తెలుగుగంగ కాల్వ నీటి విడుదల పూర్తి సామర్థ్యం 11,150 క్యూసెక్కులు, ఎస్కేప్ చానల్ కాల్వ నీటి విడుదల పూర్తి సామర్థ్యం 11,150 క్యూసెక్కులు కాగా ఎస్సార్బీసీ కాల్వ నీటి విడుదల సామర్థ్యం 4960 క్యూసెక్కుల ప్రవాహం వుండేలా క్రాస్‌రెగ్యులేటర్ నిర్మాణాన్ని రూపొందించారు. మూడు జలద్వారాల్లో ఒక్కో ద్వారానికి మూడు గేట్ల చొప్పున మొత్తం 9గేట్లను అమర్చారు. ఇదిలా వుండగా 2006లో పోతిరెడ్డిపాడు ప్రధాన కాల్వను 11వేల క్యూసెక్కుల నుంచి 44వేలకు సామర్థ్యంతో చేపట్టిన విస్తరణ పనులు నేటికి కొనసాగుతున్నాయి.



9 ఏళ్లుగా ప్రజా ఉద్యమం

సిద్ధేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ.. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 2016 మే 31వ జరిగింది. దీనికి రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు కదలి వచ్చారు. అఖిల భారత రైతు సంఘాల నాయకుడు, సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, సీనియర్ ఇంజనీర్ సుబ్బరాయుడు, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్, సిద్ధేశ్వరం ప్రాజెక్ట్ సాధన కమిటీ అధ్యక్షుడు వైఎన్‌రెడ్డితో పాటు 30వేల మంది జనం తరలివచ్చారు. ఈ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఎట్టకేలకు కపిలేశ్వరం వద్ద సీమ నేతలు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి శంకుస్థాచేశారు. ఆ తర్వాత 2017లో సీమ సత్యాగ్రహం, 2018 చలో సిద్ధేశ్వరం, అలాగే 2019లో ప్రజా పాదయాత్రను చేపట్టారు. అయితే 2020, 2021 సంవత్సరాల్లో కరోనా విపత్తు కారణంగా ఇళ్ల నుంచే స్వచ్ఛంద నిరసనలు చేపట్టారు. ఆ తర్వాత 2022లో జలదీక్ష, 2023లో జలజాగరణ దీక్ష, 2024 జలసాధన దీక్షలు చేపట్టారు. ప్రస్తుతం చలో సిద్ధేశ్వరం పేరిట భారీ బహిరంగ సభను శనివారం నిర్వహిస్తున్నారు.

మిగతా 4వ పేజీలో

వైసీపీ నేతల్లో వణుకు

- వైసీపీలో జైలు, బెయిల్ భయం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు అంచనాకు మించి విజయవంతం కావడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన తప్పులకు నేడు వారిలో జైలు, బెయిల్ భయం పట్టుకుందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతుల, సామాన్యులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల వారిని వైసీపీ నాయకులు వేధించారన్నారు. రైతుల సొంత భూములనూ కాజేసేందుకు వైసీపీ కుట్రలు చేసిందన్నారు. ఎన్నికలకు ముందు తమ అధినాయకత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హమీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. త్వరలోనే 'తల్లికి వందనం' అమలు చేస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సైతం ఇస్తున్నామని తెలిపారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లక్షలాది మంది టీడీపీ శ్రేణులతో మహానాడు విజయవంతమైందన్నారు. రెడ్ బుక్ అంటే వైసీపీ నాయకులు భయపడుతున్నారని, తప్పుచేసిన వారికే రెడ్ బుక్ వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, వి. హనుమంతరావు చౌదరి, కుమ్మరి శాలివాహన జిల్లా అధ్యక్షుడు సుగురు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



పొగచూరుతున్న జీవితాలు

- ప్రాణాలు తీస్తున్న సిగరెట్లు
- పొగాకు వాడకంతో పెరుగుతున్న క్యాన్సర్ జబ్బులు
- దీర్ఘకాల వ్యాధులకు అవకాశం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

కర్నూలు హాస్పిటల్/ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): సరదాగా, ఆకతాయిగా ప్రారంభమైన ఓ చిన్న అలవాటు... ఆపై వారి భవిష్యత్తును నాశనం చేస్తుంది.. ఆర్థికంగా, శారీరకంగా కుంగదీస్తుంది. అనేక కుటుంబాల్లో ఆలుమగల మధ్య పొగ పెడుతోంది. చివరికి ఆ కుటుంబాలను నాశనం చేస్తుంది. ఆ అలవాటే ధూమపానం. ఈ అలవాటు దీర్ఘకాలంగా ఉంటే ప్రాణాంతకమైన వ్యసనంగా పేర్కొనవచ్చు. కొందరికి సరదా... మరికొందరికీ ఫ్యాషన్ పేరేదైనా ఒక్కసారి సిగరెట్ అలవాటు వాడితే వ్యసనంగా మారుతుంది. ధూమపానం చివరికి ప్రాణాలను హరిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారతదేశంలో ప్రతి సంవత్సరం 13 లక్షల మరణాలు పొగాకు వినియోగం వల్ల కలుగుతున్నాయి. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

ఏటా రూ.250 కోట్లు బుగ్గి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిత్యం లక్షల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇందుకు నెలకు రూ.15 నుంచి రూ.17 కోట్లు సిగరెట్లు, బీడీ, చుట్టలు, గుట్కాలు, జర్దాల అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా యువత ఉండే ప్రాంతాలు, విద్యాసంస్థల సమీపంలో పొగరాయుళ్ల స్థావరాలుగా మారుతున్నాయి. ఉదహరణకు ఒక వ్యక్తి ఓ కంపెనీకి చెందిన సిగరెట్‌ను రోజుకు రెండు ప్యాకెట్లు కాలుస్తున్నారు. ఒక్క ప్యాకెట్ రూ.150 రోజుకు రూ.300 ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.9వేలు ఏడాదికి రూ.1.08 లక్షలు సిగరెట్లకు ఖర్చు చేస్తుండటం గమనార్హం.

పొగాకు క్యాన్సర్‌కు కారకం



సిగరెట్లు, చుట్టలు, బీడీలు తదితరాలను తీసుకున్న మరుక్షణం నుంచి శరీరంలోని అన్ని అవయవాల మీద విపరీతమైన ప్రభావం చూపుతాయి. పొగాకు సంపూర్ణ క్యాన్సర్‌కు కారణమవుతుంది. పొగాకులోని నికోటిన్ విష తుల్యాలు ఊపిరితిత్తులు, నోటి, అన్నవాహిక, జీర్ణాశయ క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఇటీవల కొత్తగా ప్రారంభించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఓపీ నెంబరు 222లో క్యాన్సర్ నివారణ విభాగాన్ని ఏర్పాటు చేశాం.

- డాక్టర్ కె.శివప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ అంకాలజీ, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్

శిక్షలు కఠినమే.. ప్రచారం నిల్..

2003 పొగాకు నిషేధ చట్టం ప్రకారం విద్యాలయాలకు వంద గజాల దూరంగా ఎలాంటి పొగాకు విక్రయ కేంద్రాలు ఉండకూడదు. బహిరంగంగా పొగతాగుతూ అధికారులకు పట్టుబడితే తొలిసారి రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి జరిమానా, రెండోసారి పట్టుబడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 500 జరిమానా, ఒక్కో సందర్భంలో రెండు శిక్షలు అమలుచేయవచ్చు. అయితే ఈ చట్టం ఆచరణలో లేకపోవడంతో పొగరాయుళ్ల ఆటలు సాగుతున్నాయి. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో పొగత్రాగే వారిపై చలానాలతో జరిమానా విధించే అధికారం ఉన్నా ఎక్కడా కూడా అధికారులు ఒక్క చలానా కూడా రాసిన దాఖలాలు లేవు. ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన జిల్లా మాస్ మీడియా విభాగం మొద్దు నిద్రపోతుంది.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వసతులు

- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వారంలో ప్రతి మంగళ, గురువారాల్లో వైద్యులు ప్రత్యేకంగా పొగాకు బాధితులకు ఓపీ నిర్వహిస్తున్నారు.
- పొగాకు నియంత్రించేందుకు ఓపీ నెంబరు 222లో మానసిక వైద్యులచే కౌన్సిలింగ్, చికిత్స అందిస్తున్నారు.
- క్యాన్సర్ నివారణ ఓపీలో అన్ని రకాల క్యాన్సర్ నివారణ పరీక్షలు, నోటి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడానికి తగిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

పొగాకుతో ప్రమాదకర వ్యాధులు



పొగాకు వల్ల ఊపిరితిత్తుల్లో ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిజార్డర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సంభవిస్తాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం కలిగించడమే కాకుండా గొంతు క్యాన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం వుంటుంది. ధూమపానాన్ని పూర్తిగా నిషేధించాలి.

- డాక్టర్ రాయుడు, ఆత్మకూరు

పొగాకు వాడకం హానీకరం



పొగాకు మూలంగా పెదవి, నోరు, నాలుక, అన్నవాహిక, జీర్ణాశయం ఊపిరితిత్తులు, ప్రాంక్లియాస్, మూత్రాశయం వంటి క్యాన్సర్లు వస్తాయి. కొందరు జర్దా, గుట్కా, ఖైనీలను నోట్లో పెట్టుకుని నములుతుంటారు. ఇలా పొగ, లాలాజలం ద్వారా క్యాన్సర్ కారకాలు రక్తంలోకి అక్కడి నుంచి వివిధ అవయవాలకు చేరి ప్రమాదకరంగా మారుతాయి.

- డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ హాస్పిటల్, కర్నూలు

ముఖ పరీక్ష తప్పనిసరి



పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల నోటి క్యాన్సర్, అన్నవాహిక, జీర్ణాశయ, ఊపిరితిత్తులు, మూత్రాశయం, కిడ్నీ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. దంతాల ఇన్ఫెక్షన్, చిగుళ్ల వాపు, నోటిలో పుండ్లు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వారం రోజుల్లో ఈ ఇన్‌ఫెక్షన్లు తగ్గకపోతే ముఖ పరీక్ష, బయాప్సీ పరీక్షలు తప్పక చేయించుకోవాలి. ఇటీవల కాలంలో నోటి క్యాన్సర్లు పురుషులతో పాటు మహిళల్లో కూడా కనిపిస్తున్నాయి. గొంతు బొంగురుగా ఉండటం, గొంతుకు ఏదో అడ్డుగా ఉన్నట్లు అనిపిస్తే క్యాన్సర్ వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ బి.రవీంద్రబాబు, సర్జికల్ అంకాలజిస్టు, ఓమేగా హాస్పిటల్, కర్నూలు

- పొగతో ఆరోగ్యం క్షీణించి ఆయు ప్రమాణం క్రమేపి తగ్గుతుంది. సిగరెట్ తాగే వారితో పోలిస్తే సిగరెట్ తాగని వారి ఆయుష్ ప్రమాణం కనిష్ఠంగా మూడేళ్లు అధికంగా ఉంటుంది.
- ఈ రోజు సిగరెట్ మానేసిన శరీరంలోని దాని అవశేషాలు పూర్తిగా తొలగిపోయేందుకు మూడేళ్ల కాలం పడుతుంది.
- కళ్లు, ముక్కు, గొంతు వంటి సున్నితమైన పొరలపై పొగ తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది కేన్సర్‌లకు దారితీస్తుంది.
- దగ్గు, కఫం, అల్సర్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు జటిలం అవుతాయి.
- శ్వాసనాళం మందంగా మారిపోయి కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. చలి, జ్వరం, ఫ్లూవంటివి త్వరగా వ్యాప్తిచెందుతాయి.

వివిధ కేన్సర్‌లు, అనేక జబ్బులు ఉచితం

- ఊపిరితిత్తుల్లో పొగచేరితే గుండె ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. దీని వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- సిగరెట్ కాల్చిన ప్రతిసారి రక్తపోటు అమాంతంగా 15శాతం పెరుగుతుంది. దీనివల్ల కోపం, అసహనం, ఆందోళన పెరుగుతాయి.
- చర్మంలో రక్తనాళాలు బిగుసుకుపోతాయి. ఆక్సిజన్ సరఫరా దానంతట అదే తగ్గుతుంది. ఫలితంగా ఆయాసం వస్తుంది.
- ఊపిరితిత్తులు, నోరు అన్నవాహికకే కాకుండా మెడ, స్వరపేటిక, మూత్రాశయం, మూత్రపిండాలు, జీర్ణాశయం వంటి అవయవాలకు కేన్సర్ సోకే ప్రమాదం లేకపోలేదు.



సిద్ధేశ్వరానికి తొమ్మిదేళ్లు



2016 మే 31న కపిలేశ్వరం వద్ద శంకుస్థాపన చేసిన దృశ్యం (ఫైల్)

3వ పేజీ తరువాయి

ప్రధాన డిమాండ్లు ఇవే

- శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి రాయలసీమ హక్కుగా తాగు, సాగు నీరు అందించాలి.
- కృష్ణా యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి.
- యువత భవితకు విద్యాలయాలు, పరిశ్రమల ఏర్పాటుతో పాటు అమరావతిని ఫ్రీజోన్ చేయాలి
- రాష్ట్ర విభజన చట్టంలోని ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు, జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైకోర్టు, రాష్ట్ర స్థాయి కార్యాలయాలు, కార్పొరేషన్లు సీమలో ఏర్పాటు చేయాలి.
- హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలి.
- రూ.1500కోట్లతో వచ్చే ఖరీఫ్‌కు 10లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేపట్టాలి. శ్రీశైల జలాశయం ముంపు గ్రామాలకు తాగు, సాగునీరుతో పాటు నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి.
- గుండ్రేవుల, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి.
- రాయలసీమలోని కార్యాలయాల తరలింపును నిలిపివేయాలి.
- శ్రీశైలం ప్రాజెక్ట్ పరిరక్షణకకు ప్లంజ్‌పూల్ మరమ్మతులు, పూడిక నివారించి రిజర్వాయర్ జీవిత కాలాన్ని పెంచడానికి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం నిర్మించాలి.

నేడు భారీ బహిరంగ సభ

రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపు మేరకు జలమే జీవం.. జలమే బలం.. జలమే సర్వం.. అనే నినాదంతో శనివారం సంగమేశ్వరం వద్ద భారీ బహిరంగ సభను జరపనున్నారు. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చేలా సాధన సమితి ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమకు ప్రయోజనం



సిద్ధేశ్వరం అలుగు నిర్మిస్తేనే సీమ జిల్లాలకు మేలు జరుగుతుంది. రాయలసీమకు నీటి పంపకాల్లో తీవ్ర అన్యాయం జరిగింది. శాంతియుతంగా రాయలసీమలోని అన్నివర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు ఇస్తున్నాం.

-బొజ్జా దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి, కన్వీనర్

పింఛన్ ఇప్పించండి సార్..!

ఓ వృద్ధురాలి దీనగాథ..



హొళగుంద, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 75 సంవత్సరాలు. చెవులు కూడా సరిగ్గా వినపడవు. అతి కష్టం మీద అడుగులు వేసే ఆ వృద్ధురాలు పింఛన్ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది హొళగుంద మండలం ముద్దటామాగి గ్రామానికి చెందిన మూతల బసమ్మ. రెండు రోజుల క్రితం ముద్దటామాగి గ్రామానికి వచ్చిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి పింఛన్ ఇప్పించాలని ఆమె వేడుకున్న తీరు అందర్నీ కలచివేసింది. 'సార్.. నా వయసు 75 ఏళ్లు. ఆరోగ్యం పోయింది. సరిగ్గా వినపడదు. బయటకు పోదామంటే సరిగ్గా నడవలేను. పింఛన్ లేదయ్యా... సచ్చిపోయేలోపు అయినా పింఛన్ ఇప్పించం డయ్యా...' అంటూ ఓ వృద్ధురాలు సబ్ కలెక్టర్ ఎదుట కన్నీటిపర్యంతమైంది. అయినా పింఛన్‌పై అధికారులు ఎవరూ స్పందించక పోవడంతో శుక్రవారం ఆ వృద్ధురాలు ఎంపీడీవో కార్యాలయానికి అతి కష్టంపై నడుచుకుంటూ వచ్చింది. అయితే ఆమె వచ్చిన సమయంలో సంబంధిత అధికారి లేకపోవడంతో వృద్ధురాలు బసమ్మ నిరాశగా వెనుదిరిగింది. తనకు భర్త కూడా లేడని.. బిడ్డల సంపాదన వారికే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు పింఛన్ అందిస్తే ఈ వయసులో ఆసరాగా ఉంటుందని ఆమె కనిపించిన ప్రతి ఒక్కరినీ వేడుకుంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వయసులో ఆమెను ఇబ్బంది పెట్టకుండా పింఛన్ అందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను పింఛన్ ఇప్పించాలని కోరుతున్న వృద్ధురాలు బసమ్మ (ఫైల్)

డీసీసీబీ అభివృద్ధికి కృషి

చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



ప్రభుత్వ ఉత్తర్వులను చైర్మన్ విష్ణుకు అందజేస్తున్న సీఈవో రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన విష్ణువర్ధన్ రెడ్డికి నియామక ఉత్తర్వులను బ్యాంకు సీఈవో రామాంజనేయులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఈవో రామాంజనేయులు, ఆప్కాబ్ అధికారి విజయకుమార్‌తో బ్యాంకు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విష్ణువర్ధన్ రెడ్డి చర్చించారు. వాణిజ్య బ్యాంకులతో పోటీ పడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ముందంజలో తీసుకురావాలన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు బ్యాంకు ద్వారా అన్నిరకాల కార్యక్రమాలు, పథకాలను అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సీఈవో రామాంజనేయులు మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు, సిబ్బందితో కలిసి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేసేందుకు వేగవంతంగా కార్యక్రమాల అమలు, రుణాల పంపిణీ, కంప్యూటీకరణ తదితర పనులను ప్రతి సంఘంలోనూ పూర్తి చేసినట్లు తెలిపారు.

ఉత్తమ కథలే సినిమాలకు ప్రాణం

సినీ డైరెక్టర్ రక్షా వీరం



కథా రచయితలతో మాట్లాడుతున్న సినీ దర్శకుడు రక్షా వీరం

కర్నూలు కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మంచి సినిమాకు ఉత్తమ కథలే ప్రాణం పోస్తాయని 'పోతుగడ్డ' సినిమా దర్శకుడు రక్షా వీరం అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలుకు చెందిన కథా రచయితలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షా వీరం మాట్లాడుతూ సినీ ప్రపంచంలో కొత్తదనంతోపాటూ మంచి కథ ఉండాలని, అయితే అన్నీ కమర్షియల్ అనడం సరైంది కాదని చెప్పారు. పోతుగడ్డ చిత్రానికి నేపథ్యం కర్నూలు ప్రాంతమేనని గుర్తు చేశారు. విస్తృత సాహిత్యం వల్ల అనేక మంచి కథలు పుట్టుకు వస్తాయని, కథాసాహిత్యం ఎంత గొప్పగా ఉంటే అన్ని మంచి కథలు సినీ రంగానికి ఊతమిస్తాయని చెప్పారు. రాయలసీమ ప్రాంతం నుంచీ గొప్ప కథకులు ఉన్నారని ప్రశంసించారు. గతంతో పాటూ ప్రస్తుతం కూడా అనేక సినిమా కథలు రాయలసీమ ప్రాంతంతో ముడిపెట్టినవేనని, అవి గొప్పగా విజయవంతం అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు, రచయితలు పౌరోహితం మారుతి, ఎస్‌డీవీ అజీజ్, తెలకపల్లి మధుసూదన శర్మ, కవులు డి. పార్వతయ్య, నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా, ఆద్య మెడికల్స్ అధినేత ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

- ఆస్పత్రి రెండో ప్రధాన ద్వారం తెరవండి
- పార్కింగ్ స్థలాలను గుర్తించండి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కర్నూలు జీజీహెచ్ అభివృద్ధిపై మంత్రి సమీక్ష

కర్నూలు హాస్పిటల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ, మున్సిపల్, హార్టికల్చర్, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం గుర్తించబడిన పార్కింగ్ స్థలాలను మెరుగుపరచాలని అత్యవసర ప్రాంతాల నుంచి వార్డులకు ఇతర క్లిష్టమైన ప్రాంతాలకు ట్రాలీలు, వీల్ చైర్లు కదలిక కోసం ప్రత్యేకంగా రోడ్లను మెరుగుపరచాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలోకి రావడానికి 2వ గేటును తెరవడానికి దాన్ని త్వరలో అందుబాటులోనికి తీసుకురావాలని ఆదేశించారు. కొత్త సిటీ స్కాన్‌ను వచ్చే నెల 9వ తేదీన ప్రారంభించాలని, అన్ని ఐసీయూ, ఓటీ వెంటిలేటర్లు వంటి క్లిష్టమైన పరికరాల్లో ఓపీఎస్, జనరేటర్, ఇన్వర్టర్ సౌకర్యం కనెక్షన్ ఉండేలా చూడాలన్నారు. సీఎంఎస్ విధానంలో విద్యుత్ పరికరాలు ఏసీలు, జనరేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ పరికరాల నిర్వహణ ఉందని, ఏపీఎస్‌పీడీఎస్ఎల్ ఎస్ఈతో మాట్లాడి వెంటనే ఏఈని నియమించాలని జడీ సీఈవోను ఆదేశించారు. ఆసుపత్రిలో పోస్టులు ఖాళీ ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి. సింధూ సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ కరీముల్లా, హెచ్‌డీఎస్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి

రౌడీ షీటర్లకు ముమ్మరంగా కౌన్సెలింగ్

- ఆకస్మిక తనిఖీలతో పోలీసుల నిఘా
- రౌడీషీటర్ల ఆగడాలు తగ్గుముఖం

కర్నూలు క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై పోలీసు యంత్రాంగం కఠిన వైఖరి అవలంబిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ లేక వారి ఆగడాలు మితిమీరిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఈ రౌడీషీటర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో రౌడీషీటర్లకు తీవ్రస్థాయిలో కౌన్సెలింగ్ ఇవ్వాలంటూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ఆదివారం రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిపించి హెచ్చరిస్తున్నారు. మట్కా, పేకాట కేసుల్లో ఉన్న వారిపై నిఘా మరింత కట్టుదిట్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,284 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో 154 మంది, కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో 466 మంది, పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో 308 మంది, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో 356 మంది రౌడీషీటర్లు ఉన్నారు.



షరీఫ్‌నగర్‌లో కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు(ఫైల్)

- అత్యధికంగా కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 127 మంది ఉండగా.. కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలో 103 మంది, ఆస్పరి పోలీస్ స్టేషన్ పరిధిలో 74 మంది, కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో 73 మంది, కోసిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 71 మంది, ఆదోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో 62 మంది, ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో 62 మంది రౌడీ షీటర్లు ఉన్నారు.
- అత్యల్పంగా నాగులాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు, మద్దికెర పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు ఉన్నారు. మొత్తం రౌడీషీటర్లలో 23 మంది రౌడీసీటర్లపై 10కి పైగా కేసులు ఉన్నాయి. ఒక్క హోళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఆరుగురిపై పదికి పైగా కేసులు ఉన్నాయి.
- జిల్లా వ్యాప్తంగా 44 మంది కిరాయి హంతకులు ఉన్నారు. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో ఒకరు, కర్నూలు సబ్ డివి జన్ పరిధిలో 20 మంది, పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో 18 మంది, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో ఐదుగురు ఉన్నారు.

ఆకస్మిక తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ పేరుతో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. వారానికి ఒకసారైనా సమస్యాత్మక కాలనీల్లో తెల్లవారుజామునే స్పెషల్ పార్టీ బృందాలతో వెళ్లి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పాత నేరస్తుల కార్యకలాపాలపై నిఘా ఉంచుతున్నారు. ముఖ్యంగా ట్రబుల్ మాంగర్స్ ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ నెల 22న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో తనిఖీలు చేసి 12 రికార్డులు లేని బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 5న వీకర్ సెక్షన్ కాలనీలో కార్డెన్ సెర్చ్ చేసి 10 ద్విచక్రవాహనాలు, 10 ప్యాకెట్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

క్రస్ట్ గేట్లను పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ


క్రస్ట్ గేట్లను పరిశీలిస్తున్న ఈఈ పాండురంగయ్య

గోనెగండ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను శుక్రవారం జిల్లా ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య పరిశీలించారు. ప్రాజెక్టుకు ఉన్న ఆరు గేట్లలో నాలుగు పూర్తిస్థాయిలో మరమ్మతు అయ్యాయి. మిగతా రెండు పూర్తి కాలేదు. వర్షాలు ప్రారంభం కావడంతో గేట్ల మరమ్మతు పనులు వేగవంతంగా చేయాలని ఈఈ పాండురంగయ్య జీడీపీ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జీడీపీలో ఎంత నీరు ఉన్నది?.. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వరద నీరు ఎంత వచ్చింది? అని డీఈ విజయ్‌కుమర్‌ను అడిగి తెలుసుకున్నారు. గేట్లకు జరిగే మరమ్మతు పనులను దగ్గర ఉండి పరిశీలించారు.

భార్య, అత్తపై వేట కొడవలితో దాడి

పెద్దకడబూరు , మే 30(ఆంధ్రజ్యోతి): భార్య, అత్తపై వేట కొడవలితో ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన మండలంలోని కంబదహల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన జయమ్మ కూమార్తె రేణుక అలియాస్ జయంతిని ఆలూరు మండలం అంగస్కల్ గ్రామానికి చెందిన వేమారెడ్డికి ఇచ్చి 16 ఏళ్ల క్రితం వివాహం చేశారు. కుటుంబ కలహాలతో మనస్పర్థలు వచ్చి జయంతి మూడేళ్లుగా కంబదహల్ గ్రామాంలోనే తల్లి జయమ్మ వద్ద ఉంటున్నది. ఈ నేపథ్యంలో తనకు విడాకులు కావాలని భర్త వేమారెడ్డి కోర్టుకు వెళ్లాడు. పైగా ఫోన్ చేసి చంపుతానని బెదిరిస్తున్నాడు. శుక్రవారం ఉదయం వేమారెడ్డి అత్త ఇంటికి వెళ్లి వెంట తీసుకెళ్లిన వేట కొడవలితో దాడి చేయడంతో భార్య జయంతి, అత్త జయమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు జయంతి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

ఇద్దరికి తీవ్రగాయాలు


మృతి చెందిన రైతు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మంత్రాలయం, మే 30 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో విత్తనాలు నాటి మోటారు సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొని రైతు కురువ రామన్న(62) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం జరిగింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్నహళ్లి గ్రామానికి చెందిన రామన్న తన పొలంలో విత్తనాలు నాటి, తన మనవడు ఆరేళ్ల కృష్ణకుమార్‌ను బైక్ వెనుకాల కూర్చుబెట్టుకుని ఇంటికి బయల్దేరాడు. మంత్రాలయం నుంచి మాధవరానికి ఇద్దరు వ్యక్తులతో వస్తున్న మరో బైక్ వీరి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామన్న అక్కడికక్కడే మృతి చెందగా.. కృష్ణకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తిరుమల డెయిరీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న ఆదోని ఆవన్నపేటకు చెందిన టి. పాండురంగ, రాంపురానికి చెందిన రఘు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించడంలో సహకరించాడు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కురువ రామన్న (ఫైల్)

కూలిన మట్టిమిద్దెలు

చాగలమర్రి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో వర్షాలకు తడిసిన మట్టిమిద్దెలు శుక్రవారం పాక్షికంగా కూలిపోయాయి. గ్రామానికి చెందిన బాలకృష్ణ, చెన్నమ్మ మట్టిమిద్దెలు కుప్పకూలి నష్టం వాటిల్లింది. గృహంలో ఎవరు లేని సమయంలో కూలిపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వపరంగా సాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పదోన్నతుల కోసం ఎదురుచూపులు!

ఆలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరిని ఏమాత్రం పట్టించుకోకపోగా పదోన్నతులతోపాటు పీఆర్‌సీని కూడా పక్కన పెట్టిందని ఉద్యోగులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 యేళ్లుగా పనిచేస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా పదోన్నతులు కూడా కల్పించలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మాతృశాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులకు టైం స్కేల్ అమలుకు శ్రీకారం చుట్టింది.

- ఏళ్ల తరబడి ఊసే లేదు
- కూటమి ప్రభుత్వం మీదే ఉపాధి హామీ ఉద్యోగుల ఆశలు

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే....

2014-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు, ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల(ఏపీవో)లుగాను, హెచ్‌ఆర్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్, ఈవోఆర్‌డీ కేడర్లలో (జీవోఆర్‌టీ నంబర్ 312, 2006) నియమితులైన ఏపీవోలు, ఈసీలు, కోర్స్ డైరెక్టర్లు, హెచ్‌ఆర్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్లు, సహాయ పథక సంచాలకులు(ఏపీడీ)గా పదోన్నతి పొందారు. ఏపీడీలు అడిషనల్ పీడీలుగా పదోన్నతి పొందారు. ఉపాధి హామీ పథకం అమలులో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం, అమలుపరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనపరమైన అంశాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్ని క్యాడర్లలో పదోన్నతులకు అర్హులేనని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, బీటీ, సిమెంట్ రోడ్డు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీశక్తి, రైతుసేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల ప్రహరీ నిర్మాణం తదితర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ ఉద్యోగుల భాగస్వామ్యం అధికంగా ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య, వైద్య, రైల్వే, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ మొదలైన ఇతర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ ద్వారానే జరుగుతున్నాయి. ఇందులో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయ్ (ఎఫ్‌టీఈ) ఉద్యోగులకు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతి కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఎస్‌ఆర్‌డీఎస్ కింద పనిచేస్తున్న ఎన్‌టీఈల నియామకం తేదీ తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఎన్‌టీఈలుగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలో అన్ని క్యాడర్లలో దాదాపుగా 5 వేల మంది ఉద్యోగులు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాలు కూడా రాష్ట్ర మంత్రి లోకేశ్, నాదెండ్ల మనోహర్‌ను కలిసి కూడా విన్నవించారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

అన్ని క్యాడర్లలో ఉన్న ఉపాధి ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలి



2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పదోన్నతులు కల్పించాక తిరిగి ఆ ఊసేలేదు. అన్ని క్యాటగిరీ ఉద్యోగుల సర్వీసు, విద్యాలర్హతను పరిగణలోకి తీసుకుని పదోన్నతి కల్పించాలి.

పదోన్నతులపై మంత్రులకు విన్నవించాం



ఉపాధి హామీ పథకంలో యేళ్ల తరబడి పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు సర్వీసు, విద్యార్హతను పరిగణలోకి తీసుకుని ఇంజనీర్లుగా, ఏపీఓలుగా పదోన్నతి కల్పించాలి. ఇదే విషయంపై పంచాయతీరాజ్ కమిషనర్, మంత్రులు లోకేష్, నాదెండ్ల మనోహర్‌ను కలిసి విన్నవించాం.

- తిరుమలేష్, టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, మే 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడానికి అధికారులే కాకుండా పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు కూడా కృషిచేయాలని ఆయన కోరారు. బాల్య వివాహాలను చేయాలని ఎవరైనా తమ వద్దకు వస్తే టోల్‌ఫ్రీ. నెంబర్.15100కు తెలియజేస్తే వెంటనే ఆ బాల్య వివాహాన్ని సంబంధిత అధికారులు నిలిపివేస్తారనీ తెలిపారు. కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం బాల్యవివాహాలు చేసిన వారికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ అధికారి శారద మాట్లాడుతూ బాల్య వివాహాలపై సమాచారం ఇస్తే వారు కూడా తగిన చర్యలు తీసుకుంటారనీ తెలిపారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తాము బాల్యవివాహాలను ప్రోత్సహించడం లేదని, బాల్య వివాహాల గురించి తెలిస్తే అధికారుల దృష్టికి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అనురాధ, డాక్టర్ ఉమాదేవి, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కిరణ్, ప్రభుత్వ ఖాజీ, మౌలానా సయ్యద్ అక్బర్‌బాషా, పాస్టర్ కృపాదానంరాజు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న బి.లీలా వెంకట శేషాద్రి

కందుల ధర పతనం

కర్నూలు అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): గత నెల 21వ తేదీ నాటికే మార్క్‌ఫెడ్ అధికారులు కందుల కొనుగోళ్లను నిలిపివేశారు. రైతులు మరోదారి లేక తమ వద్ద ఉన్న కందులను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు కందుల ధరను తగ్గించి కొంటున్నారు. కందులు నాణ్యంగా లేవని, ఈక్రాఫ్ నమోదు చేసుకోలేదనే కారణాలతో మార్క్‌ఫెడ్ అధికారులు కందుల కొనుగోళ్లను నిలిపివేశారు. ఈ మాటలు అబద్ధమని, తమ వద్ద భారీగా స్థాయిలో నాణ్యమైన కందులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి 428 క్వింటాళ్ల కందులను అమ్మకానికి తెచ్చారు. ప్రభుత్వం కందులకు క్వింటానికి రూ.7,500 ధర ప్రకటించింది. అయితే.. కొనుగోలు కేంద్రాలు మూసివేయడంతో రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున విక్రయానికి తీసుకువస్తున్నారు. ఈ యార్డులో శుక్రవారం గరిష్ఠ ధర రూ.6,619, మధ్యస్థ ధర రూ.6,551, కనిష్ఠ ధర రూ.2,600 మాత్రమే రైతులకు దక్కింది. అదే విధంగా వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.6,669, మధ్యస్థ ధర రూ.3,539, కనిష్ఠ ధర రూ.2712 మాత్రమే రైతులకు అందింది.

12న నంద్యాలకు వైఎస్ షర్మిల రాక

నంద్యాల రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జూన్ 12వ తేదీన నంద్యాలలో పర్యటిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. వైఎస్ షర్మిల ఈనెల 12న నంద్యాల సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో జరుగే జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఆ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి రాష్ట్రంలో వైఎస్ షర్మిల పర్యటనలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల ఇంచార్జిలు మద్దిలేటిస్వామి, ఇస్మాయిల్, జనార్దన్, బాలస్వామి, బోయ రమణ, రజాక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు లక్ష్మినరసింహ యాదవ్

ట్రాక్టర్ డ్రైవర్ బలవన్మరణం

బేతంచెర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేటకు చెందిన నడ్డి వెంకటేశ్వర్లు (30) అనే ట్రాక్టర్ డ్రైవర్ మతి స్థిమితం సరిగ్గా లేక శుక్రవారం వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఘటన జరిగింది. వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిస కావడం, మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో బలపాలపల్లె రస్తాలో ఉన్న అల్లాబకాష్ దర్గా వెనుక వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బేతంచెర్ల హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఆగిన హంద్రీ విస్తరణ పనులు

కూటమి ప్రభుత్వం రూ.3,500 కోట్లతో హంద్రీ నీవా విస్తరణకు శ్రీకారం చుట్టింది. నంద్యాల, కర్నూలు జిల్లాలలో బ్యాలెన్స్ పనులు రూ.690 కోట్లతో చేపట్టారు. జూన్ 10లోగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అయితే.. అనుకోని ముందస్తు వర్షాల వల్ల పనులు ఆగిపోయాయి. కాల్వలో వర్షపునీరు చేరడంతో మట్టి, పూడికతీత పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు సగటున 49.072 శాతానికి మించి పనులు జగరలేదు. మిగిలన సమయం పది రోజులే. విస్తరణ పనులు పూర్తవుతాయా..? ఈ ఖరీఫ్‌లో 3,850 క్యూసెక్కులు కాలువకు మళ్లించడం సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి.

- అనుకోని వర్షాలతో ఆగిన పురోగతి..!
- జూన్ 10లోగా పూర్తి చేయాలని లక్ష్యం.. పురోగతి 50 శాతంలోపే
- పది రోజుల్లో పూర్తి చేయడం సాధ్యమేనా..?

కర్నూలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో 3,850 క్యూసెక్కులు ప్రవాహానికి వీలుగా హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకెళ్లాలనే ఆశయంతో హంద్రీనీవా విస్తరణ, సీసీ లైనింగ్ పనులు ప్రాధాన్యతగా చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ.960 కోట్లలో బ్యాలెన్స్ విస్తరణ పనులు మొదలు పెట్టి జూన్ 10వ తేదిలోగా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వారం వారం పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీస్తున్నారు. కర్నూలు జిల్లాలో ప్యాకేజీ-1 కింద రూ.260 కోట్లతో చేపట్టే 0/0 నుంచి 88 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు మెగా ఇన్‌ఫ్రా సంస్థ, ప్యాకేజీ-2 కింద రూ.430 కోట్లతో చేపట్టిన 88 కి.మీలు నుంచి 201 కిలో మీటర్లు వరకు విస్తరణ పనులు డీఎస్‌ఆర్-వీపీఆర్ సంస్థలు జాయింట్ వెంచర్‌గా దక్కించుకొని పనులు చేపట్టాయి. ప్యాకేజీ-1లో 37.79 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టి పనులకు గాను 18.92 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టి పనులు (50.084 శాతం) చేశారు. ప్యాకేజీ-2 పరిధిలో 36.45 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులకు గాను 17.52 లక్షల క్యూబిక్ మీటర్లు (48.06 శాతం) పనులు చేశారు. అంటే.. సగటున 49.072 శాతం పురోగతి సాధించారు. లక్ష్యం మేరకు జూన్ 10లోగా విస్తరణ పనులు చేయాలి. మిగిలిన సమయం కేవలం పది రోజులే. అయితే.. ఈ నెల 16 నుంచి 26వ తేది వరకు జిల్లాలో కురిసిన ముందస్తు వానలు వల్ల వర్షపు నీరు కాలువలో చేరింది. అంతేకాదు.. నల్లరేగడి నేలల్లో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీంతో పురోగతి మందగించింది.


3,850 క్యూసెక్కులు తీసుకోవడం సాధ్యమా..?

కర్ణాటకలో కురిసిన ముందస్తు వర్షాలు కారణంగా ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో గేట్లెత్తి దిగువ శ్రీశైలం డ్యాంకు 97,659 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువన కర్ణాటకలో, మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు పడితే ముందే డ్యాం నిండవచ్చని సాగునీటి నిపుణులు అంచనా వేస్తున్నారు. అదేజరిగితే మల్యాల సహా వివిధ ఎత్తిపోతల పథకాల పంపులు ఆన్‌చేసి హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉంది. ఆలోగా విస్తరణ పనులు పూర్తయితే 3,850 క్యూసెక్కులు తీసుకోవచ్చు. ఒకటి రెండు కిలోమీటర్లు విస్తరణ పనులు ఆగిపోయినా ఈ ఏడాది కూడా రెండు వేల క్యూసెక్కులతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో పనులు చేసే కాంట్రాక్ట్ సంస్థలు, పర్యవేక్షించే ఇంజనీర్లు ప్రతిష్టాత్మంగా రేయింబవళ్లు పనులు చేస్తే తప్ప గడువులోగా పనులు పూర్తవ్వడం కష్టమని పలువురు పేర్కొంటున్నారు.

మట్టి పనులు పురోగతి వివరాలు. (లక్షల క్యూబిక్ మీటర్లల్లో):

ప్యాకేజీ	చేయాల్సింది	చేసింది
ప్యాకేజీ -1	37.79	18.92
ప్యాకేజీ-2	36.45	17.52
మొత్తం	74.24	36.34

వర్షం వల్ల పనులు ఆగినమాట నిజమే



హంద్రీనీవా కాలువ ద్వారా 3,850 క్యూసెక్కులు తీసుకోవడానికి వీలుగా విస్తరణ పనులు చేపట్టాం. రెండు ప్యాకేజీల్లో 74.24 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 36.34 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు చేశాం. జూన్ 16 నుంచి అనుకోకుండా ముందస్తు వర్షాలు రావడంతో పనులు ఆగిపోయిన మాట నిజమే. గడువులోగా పూర్తి చేస్తాం.

- పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు సర్కిల్-1, కర్నూలు


హంద్రీనీవా కాలువ 53.700 కి.మీల వద్ద పూడికతీత పనులు


హంద్రీనీవా కాలువ 8.900 కి.మీలు వద్ద జరుగుతున్న విస్తరణ పనులు


హంద్రీనీవా కాలువ 118 కి.మీల వద్ద సీసీ లైనింగ్ పనులు

పార్కింగ్‌కు అడ్డాగా కలెక్టరేట్

- బయటి వ్యక్తులు నిలుపుతున్న వాహనాలు
- అడ్డదిడ్డంగా పెడుతున్న వైనం
- రాకపోకలకు ఇబ్బందికరం
- పట్టించుకోని భద్రతా సిబ్బంది



కలెక్టరేట్‌లో పార్కింగ్ చేసిన ఆటోలు

కర్నూలు కలెక్టరేట్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వోన్నతాధికారి కార్యాలయం వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. కలెక్టర్ కార్యాలయానికి సంబంధంలేని వాహనాలు ఎన్నో ఇక్కడ నిలిచి ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు తమ వాహనాలను ఇక్కడ పార్క్ చేసి కలెక్టరేట్ ముందున్న ఆర్టీసీ బస్టాప్ నుంచి బస్సు ఎక్కి వెళ్తుంటారు. వీరితో పాటు కార్యాలయంలో పనుల నిమిత్తం వచ్చే ప్రజల వాహనాలతో కలెక్టరేట్ రద్దీగా ఉంటుంది. ఒక్కొక్క రోజు సాక్షాత్తు కలెక్టర్ వాహనం బంగ్లా నుంచి బయటకు వెళ్ళేందుకు కూడా దారి ఉండదు. అంత అడ్డదిడ్డం గా ద్విచక్ర వాహనాలు నిలిచిపోయి ఉంటాయి. కలెక్టర్ కార్యాలయంలో 40కి పైగా శాఖల కార్యాలయాలు, 1500 మందికి పైగా ఉద్యోగులు ఉంటారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది జిల్లా వాసులు వచ్చివెళ్తుంటారు. ఇంత రద్దీగా ఉండే కలెక్టరేట్‌లో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ పాయింటు ఒక్కటి మాత్రమే ఉంది. ఉద్యోగులకు సంబంధించి 900 ద్విచక్ర వాహనాలు, 25కు పైగా ఫోర్ విలర్స్ వాహనాలు ఉంటాయి. కాని ఈ వాహనాలన్నింటికి పార్కింగ్ పాయింటుగా రెండు షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ షెడ్లలో 100 ద్విచక్రవాహనాలు నిలిచే సామర్థ్యం ఉంటుంది. ఇక మిగిలిన వాహనాలు రోడ్లపైనే... ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం కలెక్టరేటుకు వచ్చే ప్రజలు వాహనాలలో వస్తుంటారు. ఇలా వచ్చి వెళ్లే వాహనాలు, ఉద్యోగుల వాహనాలు కలిపితే 100కి పైగా కలెక్టరేట్‌లోని రోడ్లపైనే ఉంటాయి. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారి వాహనాలు కూడా భారీగానే వస్తుంటాయి. వారి పనులు త్వరితగతిన ముగించుకోవాలనే ఉద్దేశంతో తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపివేసి వెళ్తారు. గంటల తరబడి వాహనాలు రోడ్లపైన అడ్డంగా ఉంటాయి. ఇదే కాక వాహనాలపై కూర్చొని గంటల తరబడి మాట్లాడే వారు ఎక్కువే. ఇలా ఎక్కడపడితే అక్కడ వాహనాలు, ఇతర వ్యక్తులతో కార్యాలయాలలో పని చేసే మహిళా ఉద్యోగులు, కార్యాలయాలలో పనుల కోసం వచ్చే మహిళలు ఆఫీసులలోకి వేళ్లేందుకు ఖాళీ స్థలం ఉండదు.



● **పట్టించుకోని భద్రతా సిబ్బంది:** ఎన్ని వాహనాలు కలెక్టరేట్‌లోకి వస్తున్నా ప్రధాన గేటు వద్ద ఉన్న భద్రతా సిబ్బంది వాటిని నిలిపివేయడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో కలెక్టరేట్‌లో వాహనాలు అడ్డదిడ్డంగా నిలిచిపోతున్నాయి. ఎక్కడో బయట పనులు చేసుకునే వారు కూడా కలెక్టరేట్‌లో ఖాళీగా ఉంటుందని తమ వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఇలా పార్క్ చేయడంతో కూడా వాహనాలు భారీగా నిలిపోతున్నాయి. నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్ తదితర ప్రాంతాలలో పని చేసే కొందరు ఉద్యోగులు కూడా కలెక్టరేట్‌లోనే తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తున్నారు.

● **పార్కింగ్ ఏర్పాటు చేయాలి:** కలెక్టరేట్ ప్రధాన గేటు దాటిన వెంటనే కుడి వైపుకు ఉన్న డీపీఆర్వో మందున్న ఖాళీ స్థలంలో నాలుగు చక్రాల వాహనాలు, డీఆర్వో కార్యాలయం, డీఈవో కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలాలలో పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కలెక్టరు కార్యాలయంలో వాహనాల రాకపోకలను తగ్గించాలంటే ముందుగా ఉద్యోగులు తమ వాహనాలను పార్కింగ్ పాయింట్‌లో ఉంచాలన్న బాధ్యత పెరగాలి. అలాగే బయటి నుంచి వచ్చే వాహనాలు నేరుగా కార్యాలయాల ముందుకు వెళ్లకుండా పార్కింగ్‌లోనే వాహనాలను నిలిపివేసేందుకు కార్యాలయ అధికారులు చర్యలు తీసుకోవాలి. టెండర్లు పిలిచి వాహనానికి తక్కువ ధరను నిర్ణయిస్తే... వాహనాలు ఓ వరుసలో ఉండడమే కాక.. ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తోంది.

ఇతర వాహనాలకు అనుమతి లేదు



కలెక్టరేట్‌లో పని చేసే ఉద్యోగులకు మాత్రమే పార్కింగ్‌కు అనుమతి ఉంటుంది. ఇతరులు కలెక్టరేట్ ప్రాంగణంలో వాహనాలను పార్కింగ్ చేయరాదు. ఆటోలు, ఇతర వాహనాలకు అనుమతులు లేవు. పార్కింగ్ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో ఉన్న సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తాం.

\- వెంకటనారాయణమ్మ, డీఆర్వో

లద్దగిరిలో వైభవంగా ధ్వజ ప్రతిష్ఠ

వేడుకలో పాల్గొన్న కోట్ల కుటుంబం



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల దంపతులు

కోడుమూరు రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరిలో వెలసిన శ్రీశైల అనుబంధ దేవస్థానం రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజ, శిఖర ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గతంలో ఏర్పాటు చేసిన దారువు ధ్వజస్తంభం బలహీనం కావడంతో కొత్తగా ఏర్పాటు చేశారు. వేడుకకు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, సుజాతమ్మ దంపతులు, శ్రీశైల ఆలయ ఈవో శ్రీనివాసరావు, అధికారులు, స్వామిఅమ్మవార్ల ప్రధాన అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో అభిషేకాలు, హోమాలు చేపట్టారు. అనంతరం ఆగమశాస్త్ర నియమం మేరకు నిర్ణయించిన ముహూర్తంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిపించారు. కోట్ల దంపతులు ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం గ్రామస్థులు ఆడపడుచులకు చీరసారె, ఒడిబియ్యం, కానుకలు అందించారు. వేడుకలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల హరి చక్రపాణిరెడ్డి, కోట్ల నాగేశ్వరరెడ్డి, కోట్ల కవితమ్మ, శ్రీశైల దేవస్థాన ఈఈ బాలమురళీకృష్ణ, ఏఈవో మోహన్, అసిస్టెంట్ స్థపతి జవహర్, వేదపండితులు గంటి రాధాకృష్ణశర్మ, ప్రధాన అర్చకులు వీరయ్య, మార్కండేయ శాస్త్రి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. స్థానిక రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. జాబ్‌మేళాకు మొత్తం 16 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 401 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కాగా, ఇందులో 154 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసమావేశంలో రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవోఆర్‌డీ సేవలు మరువరానివి



సుబ్బరాయుడు దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో పని చేస్తున్న ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు సేవలు మరువరానివని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి కొనియాడారు. ఈవోఆర్డీ సుబ్బరాయుడు పదవీ విరమణ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎస్ఐ సునీల్ కుమార్, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాయుడు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పని చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం సుబ్బరాయుడు దంపతులను నాయకులు, ప్రజాప్రతి నిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు శాలువ, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, చంద్రపెద్దస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంజులదేవికి మంత్రి అభినందన



మంజులదేవిని అభినందిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, మే 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌కు చెందిన స్టాఫ్ నర్సు డి.మంజులదేవి ఇటీవల అమెరికన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందింది. డాక్టరేట్ పొందిన స్టాఫ్ నర్సును శుక్రవారం రాత్రి మౌర్యఇన్ హోటల్‌లోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అభినందించారు. ప్రతి నర్సు నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని రోగులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ హెడ్ నర్సు వి.శ్రీదేవి, కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జూటూరు రవికుమార్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

కర్నూలు అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్‌లను అయన అందజేశారు. పోదూరి లలితకు రూ. 1,48,327, దినేష్‌కుమార్ రూ. 2,64,008, సయ్యద్ అంజాద్ బాషాకు రూ. 45,700, పూజారి జయలక్ష్మికి రూ.15,000 చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వార్డెన్లను బదిలీ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల్లో దీర్ఘకాలికంగా పని చేస్తున్న వార్డెన్లను బదిలీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారుకొండ సాయికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిం చారు. సాయి కుమార్ మాట్లాడుతూ కొంత మంది వార్డెన్లు సంవత్స రాల తరబడి ఒకే హాస్టల్‌లో పని చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొంత మంది వార్డెన్లు రాజకీయ, ఎన్జీవో సంఘాల పే రుతో నాయకులం అంటూ బదిలీలు కాకుండా ఒకేచోట కొనసా గుతున్నారన్నారు.

ఆలయ భూములను కొల్లగొట్టేందుకే చీకటి జీవోలు

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఆలయ భూములను కొల్లగొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం చీకటి జీవోలను తీసుకువస్తుందని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎలాంటి హక్కు లేదన్నారు. క్యాబినెట్‌లో ఈ నిర్ణయాన్ని డిప్యూటీ పవన్‌కళ్యాణ్ వ్యతిరేకించాలన్నారు. ఆలయ భూముల లీజ్, జీవోలపై బీజేపీ నేతలు స్పందించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ యూనుస్‌బాషా, నాయకులు రాఘవేంద్ర, మల్లి, షరీఫ్ పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

గూడూరు మే 30(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈకేవైసీ చేసుకుంటేనే రేషన్

సి.బెళగల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేసుకుంటేనే రేషన్ మంజూరు చేస్తామని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల ఆఖరిలోగా ఈకేవైసీ చేయించుకోవాలని రేషన్ కార్డుదారులకు సూచించారు. ఈసమావేశంలో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ నవీన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి: ఏవో

సి.బెళగల్, మే 30(ఆంధ్రజ్యోతి): రైతులకు విక్రయించే మందులను బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ దుకాణా యజమానులకు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో వెంట ఎంపీ ఈవోలు వెంకటేష్, ఈశ్వర్ ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో

గోకులం షెడ్డు నిర్మాణాలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ హెచ్చరించారు. శుక్రవారం సి.బెళగల్, పోలకల్లు, మారందొడ్డి గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్డు నిర్మాణాలను ఆయన పరిశీలించారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

జాతీయ రహదారి దిగ్బంధం.. నిలిచిపోయిన వాహనాలు



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకలు, కార్యకర్తలు

ఓర్వకల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): గార్గేయపురం-కేతవరం, పూడిచెర్ల రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు జాతీయ రహదారిని దిగ్బంధించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, మధుసూదన్, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్, సూర్యనారాయణ మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్ కోసం నీటి పైపులైన్ నిర్మాణం కోసం గార్గేయపురం, కేతవరం, పూడిచర్ల గ్రామాల మీదుగా వెళ్తుందని, ఎటువంటి భూసేకరణ ప్రక్రియను పాటించకుండా రైతుల ఆమోదం లేకుండా భూములను తవ్వేశారని ఆవేదన వ్యక్తం చేవారు. పనులు పూర్తయినప్పటికీ ఇంత వరకు రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేయలేదని, తక్షణమే రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేయాలని డిమాండ్‌చేశారు. రాస్తారోకో చేస్తున్న ప్రాంతాన్ని తహసీల్దార్ విద్యాసాగర్ సందర్శించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాననీ, రోడ్డు పనులు ప్రారంభం, పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్, బుగ్గరాముడు, సుబ్బరాయుడు, వెంకటస్వామి, వెంకటరమణ, మద్దిలేటి పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు విజయంతో తిరిగి రావాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. గుంటూరులో ఆంధ్రప్రదేశ్ స్టేట్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల క్రీడా దుస్తులను స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని గురుదత్త పాలిక్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌శర్మ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాలుతూ మన దేశంలో క్రికెట్ క్రీడకు అత్యంత ప్రాచుర్యం ఉందన్నారు. కార్యక్రమంలో మోహన్, చిరంజీవి, శివరాజ్ కుమార్, స్నేహల్, రవికుమార్, శివ, సుదర్శన్, భూషణ్, అనిల్ పాల్గొన్నారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో

శ్రీకృష్ణ రాయబారం నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హాజరవుతారన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా సీనియర్ రంగస్థల నటుడు, టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి ఎస్.మహమ్మద్ మియా ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ సత్కార కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రేషన్ పంపిణీలో తేడాలు వస్తే చర్యలు

కోడుమూరు రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో తేడాలు వస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ హెచ్చరించారు. మండలంలోని ముడుమలగుర్తి, వెంకటగిరి, క్రిష్ణాపురం గ్రామాల్లో చౌకదుకాణాలను శుక్రవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. వెంకటేశ్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ నుంచి దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపట్టనుందని తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గూడూరు మే 30(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం గూడూరులో గృహ నిర్మాణాలను పరిశీలించారు. చిరంజీవి మాట్లాడుతూ ఇళ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందిస్తామన్నారు. ఆయన వెంట హౌసిం గ్ ఏఈ జమ్మన్న, వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఉన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలి

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ద్వారా సరఫరా చేస్తున్న ఆపరేటర్లను జూన్ 1 నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలన్నారు. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు తప్ప ఇంకోటి కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభుయలు వీర న్న, నాగేశ్వరరావు, సాయిబాబ, మారెళ్ళ రామాంజనేయులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

● కార్మికుల హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. కేకే భవన్‌లో సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ చేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసాయన్నారు. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు.

పోలీసుల తీరు సరైందే..

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): తెనాలిలో కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేసిన రౌడీ షీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని నడ్డి రోడ్డుపై కౌన్సెలింగ్ ఇవ్వడం సరైందేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి కేసులో రౌడీ షీటర్లలైన నవీన్ కుమార్, జాన్ విక్టర్, రాకేష్‌లను అరెస్టు చేశారనే అక్కసుతో కానిస్టేబుల్ చిరంజీవిపై వారు దాడి చేశారని తెలిపారు. ప్రజలను రక్షించే పోలీసులపై రౌడీషీటర్ల దాడి చేసి చంపాలని చూసే వారికి కుల సంఘాలు వత్తాసు పలకడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

తాగునీరు వృథా చేస్తే చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): నగరంలో తాగునీటిని ఎవ్వరైనా వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య కొళాయి కనెక్షన్ తొలగిస్తామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ప్రకాష్‌నగర్, సంకల్‌బాగ్, ధర్మపేట, బిర్లా కాంపౌండు తదతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రకాశ్‌నగర్‌లో తాగునీటితో కొందరు రహదారులను శుభ్రం చేయడాన్ని గమనించిన కమిషనర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహల ట్యాబ్ కనెక్షలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డీఈఈ మనోహర్‌రెడ్డి తాగునీటి వృథా చేస్తున్న ట్యాబ్ కనెక్షన్లను తొలగించారు. అదేవిధంగా పరిమళనగర్, ప్రభుత్వ ఆసుపత్రిల్లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు.

రేమటలో ఊరు వాకిలి ప్రారంభం

కర్నూలు రూరల్ మే 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం రేమట గ్రామంలో శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఊరువాకిలి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకుడు రాఘవరెడ్డి, గ్రామ సర్పంచు కురువ పెద్దవెంకన్న ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలిసి చందాలు వేసుకొని ఊరివాకిలిని నిర్మిం చుకోవడం అభినందనీయమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధి గాలికి వదిలేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక గ్రామాలకు ప్రత్యేక నిధులను విడుదల చేసి అభివృద్ధి చేస్తుందని అన్నారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీ నాగరాజు గ్రామంలో పర్యటించారు. టీడీపీ నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మే 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు పీవీ కిషోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలి కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విభాగాల వారీగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు పూర్తి వివరాల కోసం 'హెచ్‌టీటీపీఎస్://పీసీబీ డాట్ ఏపీ డాట్ గవర్న్ డాట్ ఇన్' వెబ్ సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కర్నూలు క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాయలసీమ ఈగల్ సెల్ ఇన్‌చార్జి రాంబాబు తెలిపారు. శుక్రవారం బీక్యాంపు సమీపంలో ఉన్న స్కందాన్షి ఇన్‌ఫ్రా సంస్థలో పని చేసే సిబ్బందికి మత్తు పదార్థాలు వాడడడం వల్ల వచ్చే దుష్పరిమాణాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మాదక ద్రవ్యాలు నిషేధమన్నారు. త్రీటౌన్ సీఐ నాగశేఖర్ మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించు కోవడానికి వ్యాయామం, యోగా ధ్యానం వంటి మార్గాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈగల్ సిబ్బంది ఎలిషా, మాసూంవలి, పర్హాత్ ఖాన్ పాల్గొన్నారు.

అవకతవకలు జరిగితే చర్యలు



రేషన్ షాపు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ హుశేన్ సాహెబ్

మద్దికెర, మే 30 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు రేషన్ డీలర్లు తప్పనిసరిగా అందించాలని, ఏమైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హుశేన్ సాబ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మద్దికెర, కొత్తపల్లి, హంపా గ్రామాల్లో చౌకదుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి ప్రతి లబ్ధిదారుడు రేషన్‌కార్డు తప్పనిసరిగా చౌక దుకాణాలకు వెళ్లి తమకు రావాల్సిన వస్తువులను డీలర్ల వద్ద తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ రవి, ఆర్ఐ రామదాసు, వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈ ఈరన్న

తుగ్గలి, మే 30 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణం పనుల్లో నాణ్యత పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ ఈరన్న అన్నారు. శుక్రవారం జొన్నగిరి గ్రామ శివారులోని అశోకుని శిలాశాసనాలకు రూ.90 లక్షలతో వేసిన సీసీ రోడ్డును క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించి రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించకుంటే వాటికి బిల్లులు చెల్లించమన్నారు. ఈయన వెంట క్వాలిటీ కంట్రోల్ ఏఈ మాధన్న, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టరు దశరథ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల అభివృద్ధే టీడీపీ ధ్యేయం



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం ఉల్లాల గ్రామంలో బొందిమడుగుల సాగునీటి సంఘం చైర్మన్ రామాంజనేయులు నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ నాయకులు, ప్రజలతో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా నీటితో చెరువులన్నీ నింపడంతో పాటు కాలువల ద్వారా రైతుల పొలాలకు సాగునీరు అందిస్తామన్నారు. పందికోన రిజర్వాయరు నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, శ్రీనివాసులు గౌడు, వెంకట్రాముడుగౌడు, రంగారెడ్డి, మిద్దె వెంకటేశ్ యాదవ్, వల్లె వెంకటేశ్, వార్డెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగమ్మకుంటను అభివృద్ధి చేస్తాం

మద్దికెర, మే 30 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని పశువులకు, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన రంగమ్మ కుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సర్పంచ్ బండారు సుహాసిని, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ అన్నారు. శుక్రవారం రంగమ్మ కుంటలో అభివృద్ధి పనులు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో రంగమ్మకుంటను ఆధునీకరణ చేయడమే కాకుండా అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. శ్మశాన స్థలం ఆక్రమణకు గురికాకుండా కొలతలు వేయించి హద్దులు వేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కవిరెడ్డి రామాంజులు, బాబు, వెంకటేశ్వర్లు, జిలాన్, ఓబులేసు ఉన్నారు.

కూలీలందరికీ పనులు కల్పిస్తాం

మద్దికెర, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎఫ్ఏ, టీఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలీకి రూ.300 వేతనం అందే విధంగా చూడాలన్నారు.

రజకులకు రుణాలు ఇవ్వాలి

మద్దికెర, మే 30 (ఆంధ్రజ్యోతి): రజకులకు రుణాలు ఇవ్వాలని మండల రజక సంఘం నాయకులు చిరంజీవి, శ్రీనివాసులు, ప్రసాద్, రంగన్న కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రజకులకు గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆదరణ లేకుండా పోయిందన్నారు. రజకులకు సామాగ్రితో పాటు రుణాలు ఇవ్వాలని కోరారు.

విత్తనాలు వచ్చేశాయి

తుగ్గలి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ పంట కోసం సబ్సిడీ విత్తనాలు మండలానికి వచ్చాయనీ ఏవో పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం తుగ్గలి ఏవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగ పంట కోసం మండలానికి దాదాపు 1600 క్వింటాళ్లకు పైగా విత్తనాలు వచ్చాయని, విత్తనాలు కావాల్సిన రైతులు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.5,500లుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వారి గ్రామాల్లోని ఆర్‌బీకే సెంటరులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారం



చెన్నబసప్పను సన్మానిస్తున్న కమిషన్ ఏజెంట్లు

ఆదోని టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డులోని కమిషన్ ఏజెంట్లకు సమస్యలుంటే ఎమ్మెల్యే పార్థసారథి సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తానని కమిషన్ మర్చెంట్స్ అసోసియేషన్‌కు కొత్త అధ్యక్షుడిగా ఎంపికైన మరియాని చెన్నబసప్ప అన్నారు. శుక్రవారం కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే పార్థసారథిను, అధ్యక్షుడిగా మరియాని చెన్నబసప్పను అసోషియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చెన్నబసప్ప మాట్లాడుతూ మిగతా కార్యవర్గ సభ్యులను త్వరలో ఎంపిక చేస్తామని తెలిపారు.

ముక్క ముక్కలో అనారోగ్యం

- ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు
- నిబంధనలు పాటించని వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

ఆలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మాంసం వ్యాపారులు ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. కనీస నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే మాంసం విక్రయాలు చేపడుతున్నారు. మాంసం దుమ్మూధూళి పడుతున్నా, ఈగలు ముసురుతున్నా యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. అయితే గొర్రెలు, మేకలు అనార్యోగాలకు గురైనా వాటిని కూడా వధిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ఆలూరు-బళ్లారి రహదారిలోని మెయిన్ స్కూల్ ముందు, అరికెర రోడ్డులో, సంత మార్కెట్ తదితర ప్రాంతాల్లో మాంసం విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ఆదివారం, బుధవారం, మంగళవారం, శుక్రవారాల్లో విక్రయాలు జరుగుతున్నాయి.





దుమ్మూ ధూళి పడుతున్నా..

దుమ్ము, ధూళితో నిండి ఉన్న ప్రధాన రహదారిలో రోడ్డు సైడ్‌లో పొట్టేళ్లను కోసి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రోడ్డు పక్కన మాంసాన్ని ముక్కలుగా కోసి తూకాలకు సిద్ధంగా ఉంచుతున్నారు. ప్లాస్టిక్ పేపర్లపైన మాంసాన్ని విక్రయానికి ఉంచుతున్నారు. వాటిపై దోమలు, ఈగలు వాలుతున్నాయి. ఈ మాంసాన్ని కొనుగోలుదారులు తీసుకెళ్లి రోగాలబారిన పడుతున్నారు. ఇక చెరువు కట్టపై, సంతమార్కెట్‌లో ఆవు మాంసాన్ని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ఆలూరులోని మెయిన్ స్కూల్ ముందు మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. అక్కడే పొట్టేళ్లను కోసి వ్యర్థాలను స్కూల్ లోపలికి పార వేస్తున్నారు. క్లబ్ వెనక సంత మార్కెట్‌కు వెళ్లే రహదారిలో మురుగు కాలువ పక్కన వధించి వేలాడదీసి చర్మాలను వేరు చేస్తారు.

తనిఖీలు చేసిన దాఖలాలు లేవు

ఎలాంటి నిబంధనలు పాటించకుండా మాంసం విక్రయిస్తున్నా అధికారులు ఎలాంటి తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. పంచాయతీలో ఏళ్ల తరబడి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. మరోవైపు పశు సంవర్ధకశాఖ అధికారులు సైతం కన్నెత్తి చూడడం లేదు. మాంసం విక్రయాలు జరగకపోతే నీళ్లలో తడిపి గుడ్డ చుట్టి ఫ్రిడ్జ్‌లలో పెట్టి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. ఇలాంటి మటన్ తిని ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. మరోవైపు జబ్బు పడిన వాటిని తక్కువ ధరకు కొని వాటిని కోసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నా యి.

నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు

ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం. మాంసం వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తాం. విక్రయానికి ఉంచిన మాంసంపై దుమ్ము, ధూళి, ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన వాటిని మాత్రమే కోయాలి. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయరాదు. పశువైద్యులకు సమాచారం అందించి వారి ద్వారా పర్యవేక్షణ చేస్తాం. చనిపోయిన, జబ్బు పడిన పశువులను కోసి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం.

- ప్రభాకర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో, ఆలూరు

ఇవీ నిబంధనలు..

- నిబంధనల మేరకు పొట్టేళ్లు, గొర్రెలు, మేకపోతులు పశువులు పూర్తిగా ఆరోగ్యకరమైనవిగా పశువైద్య అధికారులు నిర్ణయించాలి.
- మాంసం విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలి. ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మాంసం కోసే వ్యక్తికి ఎలాంటి అనారోగ్యం, గాయాలు ఉండకూడదు. ప్రత్యేకంగా యూనిఫాం ధరించి చేతులకు గ్లౌజులు ధరించాలి.
- అమ్మకాలను ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే విక్రయించాలి. ఇంత జరుగుతున్నా ప్రజారోగ్య అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.



యోగాపై ప్రజలకు అవగాహన కల్పించండి

● రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీచేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



గణేకల్‌లో యోగా రిజిస్ట్రేషన్ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఆదోని రూరల్, మే 30 ఆంధ్రజ్యోతి) : యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఇస్వీ, పెద్దతుంబళం, గణేకల్, జి.హోసళ్లి గ్రామాల్లో పర్యటించి యోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఇప్పటి వరకు 38వేల 653మంది యోగా శిక్షణలో పాల్గొనడానికి దరఖాస్తు చేసుకున్నారని, వచ్చే నెల 2వ తేదీ వరకు యోగాపై ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. యోగాపై మాస్టర్ ట్రైన్ తీసుకొన్న 20మంది ట్రైనర్లు 321మంది ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, అధికారులు ఉన్నారు.

కార్యకర్తల సేవలను గుర్తించిన అధిష్ఠానం



టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అభినందిస్తున్న మీనాక్షి నాయుడు

ఆదోని రూరల్, మే 30 ఆంధ్రజ్యోతి) : టీడీపీ కోసం నిరంతరం కష్టపడుతున్న గ్రామ స్థాయి టీడీపీ కార్యకర్తల సేవలను అధిష్ఠానం గుర్తించింది. ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన విరుపాక్షి, సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన మల్లికార్జున మన టీడీపీ యాప్ సోషల్ మీడియా కార్యకర్తలు. వీరు నిరంతరం పార్టీ చేపడుతున్న పలు కార్యక్రమాలను, అదేవిధంగా వైసీపీ చేస్తున్న ఆరాచకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తూ, టీడీపీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. వీరి ఇరువురు చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం మహానాడు అనంతరం వీరిని పార్టీ అదినాయకులు సన్మానించి సైకిల్, వీఐపీ కార్డును అందజేశారు. దీంతో శుక్రవారం విరుపాక్షి, మల్లికార్జునలను మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అభినందించి సన్మానించారు.

6న పులికొండ భూములకు వేలం పాట

పత్తికొండ, మే30(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండల పరిధిలోని పులికొండ రంగనథస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములకు జూన్ 6న వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో వీరయ్య తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ వేలంపాట నిర్వహిస్తున్నామని, పాటలో పాల్గొనే వారు రూ.50వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పాటదారులకు మూడేళ్ల పాటు దేవాలయ భూములు కౌలు హక్కులను పొందుతారన్నారు.

మద్యం వాహనాలను నడపరాదు...

ఆదోని రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఎమ్మిగనూరు బైపాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న వారిపై కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా విధించారు.

620 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు

వెల్దుర్తి, మే 30(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలానికి 620 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా తెలిపారు. శుక్రవారం చెరుకులపాడు గ్రామ రైతుసేవా కేంద్రంలో వేరుశనగ విత్తనాలను పరిశీలించారు. దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దేశ సమైక్యత పరిరక్షణకు పోరాడుదాం



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షాలు

పత్తికొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో మత సామరస్యం, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపైన దాడి జరుగుతుందని, దేశ సమైక్యతపై అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపై నిలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదం, మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోసం ప్రజలు నిలవాలన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ముప్పు వాటిల్లిందని, మతతత్వం, ఉగ్రవాదం నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, వైసీపీ మండల కన్వీనర్ నాగరాజు, మైనార్టీ సంఘం నాయకులు కపిల్, ఇబ్రహీం, ఫర్టిలైజర్స్ సంఘం నాయకులు గాంధీరెడ్డి, సీపీఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, దస్తగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ బాషా, కేవీపీఎస్ నాయకులు కాశీ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఆలూరు, మే30(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని ఆలూరు మండల ప్రత్యేకాధికారి వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టి తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మద్దిలేటిస్వామి, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్‌రావు ఉన్నారు.

అహల్యబాయికి ఘన నివాళి



పత్తికొండలో అహల్యబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మహారాణి అహల్యబాయి జయంతిని ఘనంగా జరిగాయి. స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో 295వ అహల్యబాయి కోల్కర్ చిత్రపటానికి బీజేపీ నాయకులు కరణం నరేష్, గోవర్ధన్‌లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ మహిళా శక్తికి ప్రతీక ధైర్యసాహసాలు, ధార్మిక చైతన్యం, ప్రజా పరిపాలనకు ఆమె చూపిన స్ఫూర్తి నేటి నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహిళా సాధికారతకు మార్గం వేసిందని, ప్రజా సమస్యల పట్ల అపారమైన బాధ్యతా భావంతో పాలన సాగించిందని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీసీ రంగన్న, మల్లికార్జున, వీరేష్, గోరంట్ల, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ దేవర ఉత్సవంలో ఎమ్మెల్యే

ఆలూరు, మే30(ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం కురువళ్లి గ్రామంలో సుంకులమ్మ అవ్వ దేవర ఉత్సవానికి బుధవారం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను వైసీపీ నాయకులు మంజునాథ్ సన్మానించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు బుసినే వెంకటేష్, అరికెర వెంకటేశ్వర్లు, మల్లికార్జున, భాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జూన్ 2న చేపట్టే సీపీఐ ఆందోళన కార్యక్రమం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం కండప్ప, టైలర్ బాషా, శేకర్, భాస్కర్ పాల్గొన్నారు.

న్యాక్ కేంద్రంలో తాపీ మేస్త్రీకి ఉచిత శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకులకు తాపీ మేస్త్రీ (బెల్డర్) కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(న్యాక్) శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి బీజీ ఉలిగన్న శుక్రవారం తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వరకు ఉన్న నిరుద్యోగ యువకులకు తాపీ మేస్త్రీలో శిక్షణ ఇచ్చి వారికి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. ప్రముఖ కంపెనీలలో ఉపాధి పొందేందుకు ఆ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. వివరాలకు ఆర్ట్స్ కళాశాల రహదారిలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో గాని 9989109 688, 9985851817, 9397031486 సంప్రదించవచ్చు అన్నారు.

లలిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య

ఆస్పరి, మే30(ఆంధ్రజ్యోతి): దళిత గిరిజన హక్కుల కోసం విప్లవోద్యమ పోరాటంలో అసువులు బాసిన మావోయిస్టు లలిత అలియాస్ సంగీత కుటుంబాన్ని ఆ వర్గాల సంఘాల నాయకులు ఆదుకునేందుకు ముందుకు రావాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె సొంత గ్రామమైన ములుగుందం కుటంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో పోలీసు కాల్పుల్లో మావోయిస్టు లలిత మృతిచెందడం దారుణమన్నారు. కనీసం కుటుంబ సభ్యుల కడసారి చూపుకు కూడా మృతదేహాన్ని అక్కడే రాష్ట్ర ప్రభు త్వం, కేంద్ర ప్రభుత్వం అప్పగించకపోవడం అన్యాయమన్నారు. 27 మంది ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మృతదేహాలను కుటుంబాలకు అప్పగించకపోవడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సలహాదారుడు అంజనే య, మణికుమార్, రాజబాబు, పంపయ్య, లక్ష్మన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి

ఆదోని అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఐదుగురికి పదోన్నతి కల్పించారు. నెహ్రూ మెమోరియన్ ఉన్నత పాఠశాలకు మునిసిపాలిటీ హైస్కూల్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఫయాజుద్దీన్‌కు పదోన్నతి కల్పించగా ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌ఎం అలీమ్ సిద్ధికి అండర్ పేట ఉర్దూ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆర్‌ఆర్ లేబర్‌కాలనీ ఉన్నత పాఠశాలలకు మునిసిపల్ హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కే రవికి కల్లుబావి మునిసిపల్ హైస్కూల్‌కు, మునిసిపాల్ పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు గిరిబాబుకు కిల్సన్ పేట మునిసిపల్ ఉన్నత పాఠశాలకు, మునిసిపల్ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉరుకుందప్పను హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు. అప్ గ్రేడ్ అయినా పాఠశాలలన్నిటికీ హెచ్‌ఎంలను ప్రభుత్వం కేటాయించింది.

వక్ఫ్ సవరణ చట్టం ముస్లింలకు ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎస్‌డీపీఐ నాయకుడు హమీద్

హొళగుంద, మే 30 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజానికి ప్రమాదకరం అని ఆలూరు తాలుక ఎస్‌డీపీఐ ఇన్‌చార్జ్ అబ్దుల్ హమీద్ శుక్రవారం అన్నారు. స్థానిక ఎస్‌బీ పంక్షన్ హాల్లో ఎస్‌డీపీఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ అబ్దుస్ సుభాన్, ఎమ్మిగనూరు అసెంబ్లీ ఉపాధ్యక్షులు జహీరీ హఫీసాబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం-2025 భారత రాజ్యాంగానికి విరుద్ధమని, ఈ చట్టం ద్వారా ముస్లింలకు కలిగే నష్టాలను గురించి అవగాహన కలిగించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు, అణగారిన వర్గాలకు స్వేచ్ఛ, న్యాయం, రక్షణ, సమానత్వం, భారత్ రాజ్యాంగ పరిరక్షణ కోసం ముందు వరుసలో ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఉపాధ్యక్షులు సలాం కార్యదర్శి, హఫీజ్, సభ్యులు ఫజిల్, అస్లామ్, హరూన్, అల్లబకాష్, రహమతుల్లా పాల్గొన్నారు.

మహానాడు విజయవంతంతో కార్యకర్తల్లో జోష్

ఆలూరు, మే30(ఆంధ్రజ్యోతి): కడప మహానాడు విజయవంతం కావడంతో టీడీపీ క్యాడర్‌లో జోష్ నెలకొందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ శుక్రవారం అన్నారు. మహానాడు సభకు ఆలూరు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయ ఢంకా మోగిస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ఆలూరు, మే30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు మండల టీడీపీ కన్వీనర్ అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతులను టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, గూళ్యం రామంజి, జిలానీ, అంజి, రాముయాదవ్, గుండయ్య, హనుమప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

వెల్దుర్తి, మే 30(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేసిందన్నారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం చవితిని పురస్కరించుకుని వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ: వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. శుక్రవారం జ్యేష్ఠ చవితి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు.

మఠం మేనేజర్‌గా ఎస్‌కే శ్రీనివాసరావు



మంత్రాలయం, మే 30 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం మేనేజరుగా ఎస్‌కే శ్రీనివాసరావును నియమించారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదేశాలు మేరకు జూన్ 1 నుంచి బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జ్యోషి తెలిపారు. అయితే, గతంలో మేనేజరుగా కొనసాగుతూ ఎస్‌కే శ్రీనివాసరావు మూడు సార్లు రాజీనామా చేసి తిరిగి బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే. గత ఏడాది సెప్టెంబరు 15న ఆరోగ్యం సహకరించడం లేదని, 74 ఏళ్ల వయస్సులో పని చేయడం ఇబ్బందిగా ఉందని పీఠాధిపతిని కోరడంతో రాజీనామాను అంగీకరించారు. తిరిగి నాల్గోసారి మఠం మేనేజరుగా నియమకం కావడంతో శ్రీమఠం అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులకు అభినందనలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మేనేజర్- ఏగా వెంకటేష్ జోషి విధులు నిర్వహిస్తున్నారు.

పోక్సో కేసుపై విచారణ



గ్రామస్థులను విచారిస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

కౌతాళం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో గురువారం రాత్రి ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అత్యాచారం చేయడంతో ఆ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను విచారించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. త్వరలో నిందితుడిని పట్టుకుని కఠిన శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై గ్రామాలలో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేలా ప్రజలు పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తెలిపారు. వీరి వెంట మంత్రాలయం సీఐ రామాంజులు, కౌతాళం హెడ్ కానిస్టేబుల్ సోమ్లా నాయక్ ఉన్నారు.

రేపటి నుంచి చౌక దుకాణాల్లో రేషన్

కోసిగి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు చౌక దుకాణాల్లోనే డీలర్లు పంపిణీ చేస్తారని కోసిగి తహసీల్దార్ రుద్రగౌడు శుక్రవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు డీలర్లు రేషన్ అందజేయాలన్నారు. మండలంలోని 42 రేషన్ దుకాణాలు జూన్ 1వ తేదీన అందరూ సమయపాలన పాటించి కార్డుదారులకు రేషన్ సరుకులు అందించాలన్నారు. ఇప్పటికే మండలంలోని రేషన్ షాపులు మొత్తం తనిఖీ చేశామని, డీలర్లకు అన్ని సూచనలు ఇచ్చామన్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

కౌతాళం, మే 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తుండటంతో నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. చాలా దుకాణాల్లో నకిలీ విత్తనాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని వ్యవసాయ అధికారులు మాత్రం ఎక్కడ తనిఖీలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. మండలంలో నకిలీ విత్తనాలను అరికట్టకపోతే రైతులతో కలిసి వ్యవసాయ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

సర్పంచుకు పరామర్శ

కోసిగి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.బెళగల్ సర్పంచ్ మాల పద్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొంది గ్రామానికి వచ్చారు. శుక్రవారం సర్పంచ్ ఇంటికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి వెళ్లి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అధైర్య పడవద్దన్నారు. టీడీపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, సోల్మాన్ రాజు, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడుదాం

ఎమ్మిగనూరు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతను కాపాడుదామని వామపక్ష నాయకులు అన్నారు. శుక్రరవారం వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్, సోమప్ప సర్కిల్, గాంధీ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. నాయకులు గోవిందు, సత్యన్న, రాజు మాట్లాడుతూ ఉగ్రవాదం పేరుతో కేంద్రంలోని అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో లక్ష్మీ, నరసయ్య, సురేష్, కృష్ణ, ఆంథోని, ఎల్లప్ప పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

మున్సిపల్ కౌన్సిల్‌లో ఉద్రిక్తత

- సమావేశం హాల్‌లోకి చొచ్చుకొచ్చిన బీసీ సంఘాల నాయకులు
- శ్మశానంలో రోడ్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్

ఎమ్మిగనూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. శుక్రవారం మున్సిపల్ పురపాలక సంఘం సమావేశం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ శ్మశాన వాటిక



కౌన్సిల్ సమావేశం హాల్ ఎదుట బైఠాయించిన బీసీ సంఘాల నాయకులు

మీదుగా 2023లో రోడ్డుకు కౌన్సిల్ ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలని కోరుతూ బీసీ సంఘాల నాయకులు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లోకి చొచ్చుకువచ్చారు. అడ్డుకున్న మున్సిపల్ సిబ్బందిపై బీసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ శ్మశానవాటిక స్థలంలో రోడ్డుకు ఎలా అనుమతి ఇచ్చారని మున్సిపల్ చైర్మన్‌ను, సభ్యులను, అధికారులను ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రోడ్డుకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ చైర్మన్ రఘుకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే కమిషనర్ గంగిరెడ్డితో మాట్లాడేందుకు వెళ్లగా సమావేశం జరిగే సమయంలో లోపలకు రావటం తగదని బయటకు వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు నాయకులను బలవంతంగా బయటకు పంపారు. సభ ప్రారంభంలో వైస్ చైర్మన్ నజీర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి స్పెషల్ గ్రేడ్ రావటంతో పట్టణం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. బీసీ శ్మశానవాటిక మీదుగా రోడ్డుకు అప్పట్లో 17వ వార్డు ప్రజలు అధికారులకు విన్నవించటంతోనే కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ తీవ్రంగా ఆక్షేపించారు. రూ. లక్షల్లో ముడుపులు తీసుకొని ఒక వ్యక్తికి లబ్ధి చేకూర్చేందుకు రోడ్డుకు 2023లో కౌన్సిల్ తీర్మానం చేశారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు కౌన్సిల్‌లో ప్రస్తావించినా పట్టించుకోలేదన్నారు. దయాసాగర్ మాట్లాడుతుండగా వైస్‌చైర్మన్ నజీర్ అడ్డుతగలడంతో, నజీర్ టీడీపీ సభ్యులు రామదాసు గౌడ్, ఇసాక్, అమాన్, వాహీద్‌ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం చైర్మన్ రఘు స్పందిస్తూ బీసీ శ్మశానవాటిక స్థలంలో ఎవరికి రోడ్డు ఇస్తూ మ్యాప్ ఇవ్వలేదని, అదేవిషయాన్ని టీపీవో రాజేష్ తెలిపారు. ప్రస్తుతం కోర్టులో ఉందని తేలిన తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి



కౌన్సిల్ సమావేశం నుంచి బయటకు వెళ్లాలని కోరుతున్న చైర్మన్ రఘు

మాట్లాడుతూ 2023లో అక్కడ రోడ్డు కావాలని ప్రజలు కోరటంతో కౌన్సిల్‌లో పెట్టామన్నారు. సమస్య కోర్టులో ఉందన్నారు.

● మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీ సభ్యులు బజారి మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎవరిని అడిగి అజెండాలో పెడుతున్నారని ప్రశ్నించారు. మా వార్డులో 200 కుటుంబాలకు తాగునీరు అందటం లేదని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదన్నారు. అలాగే 22వార్డు వైసీపీ కౌన్సిలర్ కేశవరెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లగా గాంధీ నగర్‌లో సీసీ రోడ్డు వేయాలని కోరినా పట్టించుకోవటం లేదన్నారు. 2వ వార్డు వైసీపీ కౌన్సిలర్ అంపమ్మ మాట్లాడుతూ సార్.. మావార్డు ఏం పాపం చేసింది చెప్పండి.. మావార్డు ఊర్లో లేదా.. రోడ్లు వేయాలని వందసార్లు చెప్పినా పట్టించుకోరా అంటు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 6వార్డు వైసీపీ కౌన్సిలర్ శివకుమార్ మాట్లాడుతూ బీసీ స్మశానవాటిక సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. అలాగే వార్డులో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో డీఈలు నీరజ, నాయక్, టీపీఓ రాజేష్, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, కాశీం బేగ్, రాజరత్నం, ఇసాక్, అమాన్, వాహీద్ పాల్గొన్నారు.

అడిగేవారెవరు..?

- పైసలిచ్చుకోండి.. పనులు చేసుకోండి
- ఎల్లెల్సీ కాలువపై అక్రమ పైపులైన్ల ఏర్పాటు
- ఒక్కొక్క మోటారుకు రూ.10-15వేలు వసూలు

ఎమ్మిగనూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీ అధికారుల చేతివాటంతో ఎల్లెల్సీ కాలువపై అనుమతులు లేని పైపులైన్లతో కొంతమంది జలచౌర్యానికి తెర లేపారు. అడిగేవారు లేకపోవడంతో ఏకంగా ఎల్లెల్సీ కాలువ సమీపంలో ఓ చిన్నపాటి కాలువను తవ్వి పైపులైన్ల ద్వారా పెద్దపెద్ద మోటార్ల సహాయంతో నీటిని తోడేస్తున్నారు. పైపులైన్ కనిపించకుండా మట్టితో కప్పేసి జలచౌర్యానికి పాల్పడుతున్నారు. మండలంలోని మల్కాపురం గ్రామ సమీపంలో ఆదోని సబ్‌డివిజన్-2 కాలువతో పాటు చెన్నాపురంతో పాటు పెద్దకడుబూరు మండలంలోని మేకడోన తదితర ప్రాంతాల్లో కొంతమంది రైతులు ఎల్లెల్సీ అధికారుల సహకారంతో చిన్నపాటి కాలువలను ఏర్పాటు చేసుకొని జలచౌర్యానికి పాల్పడుతున్నట్లు స్థానిక రైతులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఎల్లెల్సీ కాలువపై ఎలాంటి తవ్వకాలు గాని, ఎల్లెల్సీ కాలువకు పైపులు ఏర్పాటు చేసి మోటారులతో నీటిని పంపింగ్ చేయరాదు. కాని ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే అన్ని పనులు జరుపుతున్నారు.





మల్కాపురం సమీపంలో ఎల్లెల్సీ కాలువపై వేసిన పైపులైన్లు, మేకడోన గ్రామ సమీపంలో పైపులైన్ ఏర్పాటు కోసం తవ్విన కాలువ

ఒక్కొక్క మోటారుకు రూ.10-15వేలు వసూలు?

ఒక మోటారు ఏర్పాటు చేసుకోవాలంటే ఎల్లెల్సీ అధికారులకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు రైతులు ఇస్తున్నట్లు సమాచారం. ఇలా దాదాపు వందమందికి పైగా రైతులు ఎల్లెల్సీ కాలువ నుంచి నీటిని తమ పొలాలకు మళ్లించుకుంటున్నట్లు స్థానిక రైతులు, ప్రజలు తెలుపుతున్నారు. పైసలు ఇవ్వని రైతుల నుంచి ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఏడాదికి రైతుల నుంచి దాదాపు రూ.10లక్షలకుపైగా ముడుతున్నట్లు తెలిసింది.

అక్రమంగా పైపులైన్లు ఏర్పాటు చేస్తే చర్యలు

ఎల్లెల్సీ కాలువపై పైపులైన్‌ల ఏర్పాటుకు ఎవరికి అనుమతి ఇవ్వలేదు. పైపులైన్‌లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమాలకు ఎక్కడా తావులేదు.

రామాంజనేయులు, ఎల్లెల్సీ ఏఈ, ఆదోని సబ్ డివిజన్-2

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నందవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు విష్ణు, కాశీం, సమీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశా లల్లో డోనేషన్లు వసూలు చేయడంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్నారు. అంతే కాకుండా జీవో నెంబర్ 1 ప్రకారం మాత్రమే ఫీజులు వసూలు చేయాలన్నారు. ఫీజుల వివరాలు పాఠశాలల నోటీస్ బోర్డులలో అతికించాలన్నారు. అలాగే పిల్లలకు స్కూల్‌ల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసే పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

'చలో సిద్ధేశ్వరం'ను జయప్రదం చేయండి

రాయలసీమ సాగునీటి సాధన కమిటీ జేఏసీ అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న నాగన్న

ఎమ్మిగనూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : చలో సిద్ధేశ్వరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన కమిటీ జేఏసీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సత్యనారాయణ రెడ్డి, నాగన్న మాట్లాడుతూ శనివారం సిద్ధేశ్వరంలో నిర్వహిస్తున్న రామలసీమ సాగునీటి సాధన 9వ వార్షిక మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని, అందులో రాయలసీమ కూడా ఒక భాగమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తించాలని అన్నారు. సిద్ధేశ్వరం అలుగు, పెండింగ్ ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు పూర్తయితే రాయలసీమ కరువు నుంచి విముక్తి పొందుతుంద న్నారు. సభలో రైతులు, ప్రజా సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సప్ప, బతకన్న, నేపాల్, రఘు, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు , మే 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదల ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరులోని సీపీఐ కార్యాలయంలో 2న నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణంలో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబు, హసన్ , నరసింహులు, నబి రసూల్, చాంద్ బాషా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్ , మే 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆప్కోస్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేశారన్నారు. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, విజయేంద్ర, హరిప్రసాద్, ఈరన్న, శేఖర్, అమృత, రాజు, బాషా పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు జెండా ఆవిష్కరించారు. స్థానిక కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాముడు మాట్లాడారు. కార్మికుల, ఉద్యోగుల, కర్షకుల సమస్యలపై రాజీలేని ఉద్యమాలు నడిపిన సంఘం సీఐటీయూ అని అన్నారు. సమావేశంలో తిమ్మన్న, నాగరాజు, రవి పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో నాయకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, మే 30(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో నిలిచిన వర్షం నీటిని పరిశీలించి దోమల నివారణ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రంగారవళి, ఆరోగ్యవిస్తరణ అధికారి హనుమంతు, మాధవి, ఆశా వర్కర్లు జైనాబీ, సుజాత, లక్ష్మి, ఖలీల్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): అధికంగా డబ్బులు వసూళ్లు చేస్తున్న ఆధార్ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, పీడీఎస్‌వో జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రబాబు, వైపీఎల్ నాయకులు లక్ష్మన్నలు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఆధార్ సెంటర్ల నిర్వాహకులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఆధార్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధనుష్, రామకృష్ణ, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నాయకులకు సన్మానం

ఎమ్మిగనూరు, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కండేయ పద్మశాలి బహుత్తమ సంఘం నాయకులను బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం హెచ్‌బీఎస్ కాలనీలోని బ్రహ్మకూమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కొత్తగా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనా చుంచా రంగస్వామి, యువజన సంఘం అధ్యక్షుడు రఘునాథ్, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రవి కలందలను నిర్వాహకులు బీకే విజయలక్ష్మి, అరుణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించి ఈశ్వరుని కృపకు పాత్రులు కాగలరన్నారు.



పద్మశాలి సంఘం నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

అమెరికా ఒత్తిడికి తలొగ్గడం సరికాదు



మాట్లాడుతున్న వెంకటేశులు

మంత్రాలయం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల పహల్గామ్ దాడికి నిరసనగా, కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఖండించి ఆపరేషన్ సిందూర్‌కు అన్ని పార్టీలు మద్దతు ఇస్తే.. ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని ఆపడం సరికాదని సీపీఎం జిల్లా నాయకులు వెంకటేశులు, మండల కార్యదర్శి జయరాజు అన్నారు. శుక్రవారం మంత్రాలయంలో సీపీఎం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 2న సోమవారం చేపట్టే సమైక్యత యాత్ర ర్యాలీ వామపక్షాలందరూ కలిసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆంద్రయ్య, ప్రాణేష్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోసిగి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు యోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కోసిగిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి యోగాంధ్రలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో-2 శోభారాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కోసిగి మండలం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఐదుగురు యోగా మాస్టర్ ట్రైనర్లు రాజారాం, రామచంద్ర, కోడి ఈరన్న, సుమ, వీరేష్ సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ ఇచ్చారన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలు, అధికారులు యోగా ట్రైనింగ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ హరూన్ రషీద్, సీఆర్‌పీలు హుసేనీ, అనంతరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం : కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడంతో మానసికోల్లాసం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. 11వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ శిక్షణా తరగతులు జూన్ 20 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఉప్పర కల్యాణ మండపం, బాలుర ప్రభుత్వ పాఠశాల, ఇండోర్ స్టేడియం, పాత మున్సిపల్ కార్యాలయంలో యోగాంధ్ర శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ ఈరన్న, హేమలత, గోపాల్, బాబు పాల్గొన్నారు.